# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
20-5-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 60

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## బండి భగీరథ్ కేసులో మరో సిట్!

ఏకంగా న్యాయమూర్తి పైనే సోషల్ మీడియాలో దుష్ప్రచారం

సీరియస్ గా తీసుకున్న పోలీస్ శాఖ

విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు

**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్:** తెలంగాణలో ప్రకంపనలు సృష్టిస్తోంది బండి భగీరథ్ కేసు వ్యవహారం. ఊహించని మలుపులు తిరుగుతోంది. అయితే ఈ కేసు విచారణ సందర్భంగా గౌరవ హైకోర్టు న్యాయమూర్తిని టార్గెట్ చేసుకొని.. సోషల్ మీడియా వేదికలపై కొందరు అనుచిత ప్రచారానికి తెర లేపారు. ఇది తీవ్ర కలకలం రేపింది. న్యాయవ్యవస్థ ప్రతిష్టతను, విశ్వసనీయతను దెబ్బతీసేలా

- మిగతా 2వ పేజీలో

## వచ్చే ఎన్నికల్లో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పోటీ!

- నంద్యాల ఎంపీగా ఛాన్స్
- లేకుంటే కర్నూలులో టీజీ భరత్ పై..
- పక్కా వ్యూహంతో జగన్



వచ్చే ఎన్నికల్లో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పోటీ చేస్తారా? ఎంపీగా చేస్తారా? ఎమ్మెల్యేగా చేస్తారా? పొలిటికల్ వర్గాల్లో దీనిపైనే ఆసక్తికర చర్చ నడుస్తోంది. ఇటీవల కర్నూలు వచ్చి మరి మంత్రి టీజీ భరత్ పై విరుచుకుపడ్డారు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి. దీనిపై కౌంటర్ ఇచ్చారు మంత్రి భరత్. మధ్యలో ఎంపీ బైరెడ్డి శబరి వచ్చారు.

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** సోదరుడు సిద్ధార్థ రెడ్డి పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మరోవైపు టీజీ వెంకటేష్ సైతం రంగంలోకి దిగారు. బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ మొత్తం పరిణామాలతో రాజకీయం వేడెక్కింది. వచ్చే ఎన్నికల్లో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి బరిలో దిగేందుకు జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని..

మిగతా 2లో



### యుద్ధప్రాతిపదికన పాలమూరు-రంగారెడ్డి

# భూసేకరణ

వీలైనంత త్వరగా సేకరణ జరగాలని ఆదేశం

ప్రజాప్రతినిధులతో ప్రాజెక్టులపై సిఎం రేవంత్ సమీక్ష

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను దగ్గరుండి యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయించాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులు, ప్రజా ప్రతినిధులను ఆదేశించారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి వీలైనంత త్వరగా

- మిగతా 2,3వ పేజీలో

## తెలంగాణ కేబినేట్ భేటీ 23కు వాయిదా ?

సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో నిర్ణయం

23న యాదగిరిగుట్టలో నిర్వహించే యోచన

అధికారికంగా ప్రకటించడమే తరువాయి

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** రాజధాని వెలుపల మరోమారు తెలంగాణ కేబినేట్ సమావేశం జరగనుందని సమాచారం. గతంలో మేడారంలో కేబినేట్ నిర్వహించిన సిఎం రేవంత్ రెడ్డి తాజాగా ఇప్పుడు



## రాజకీయాల్లోకి భూమా మౌనిక!

స్పష్టమైన ప్రకటన చేసిన భర్త మంచు మనోజ్

సేవా కార్యక్రమాలు ప్రారంభించిన దంపతులు

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** తెలుగు సినిమా రంగంలో మంచు ఫ్యామిలీది ప్రత్యేక స్థానం. సినీ రంగంలో తనకంటూ ఒక ముద్ర చాటుకున్నారు మోహన్ బాబు. తర్వాత రాజకీయాల్లోకి వచ్చి రాజ్యసభ సభ్యుడు అయ్యారు.

మిగతా 2,3లో

## తమిళనాడులో స్టాలిన్ మైండ్ గేమ్!

త్వరలో ప్రభుత్వం పడిపోతుందంటూ ప్రకటన

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలంటూ డీఎంకే శ్రేణులకు పిలుపు

అంత వ్యూహామే అంటున్న విశ్లేషకులు



**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** తమిళనాడులో రాజకీయం మళ్లీ వేడెక్కింది. దళపతి విజయ్ నేతృత్వంలో ప్రభుత్వం కొలువుదీరింది. కనీసం కుదురుకోకముందే మాజీ సీఎం స్టాలిన్ సరికొత్త రాజకీయ మైండ్ గేమ్ కు తెర లేపారు.

## గ్రామకంఠం భూములకు విముక్తి!




రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం

పన్నుల రసీదుతో రిజిస్ట్రేషన్లు

కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీ ప్రభుత్వం దూకుడుగా ఉంది. దూకుడు నిర్ణయాలు



## చంద్రబాబుతో బాలినేని భేటీ!

వైయస్ కుటుంబ ఆప్తుడుగా ఉంటూ వైసీపీకి గుడ్ బై

ఏడాది కిందట జనసేనలో చేరిక

## మత్స్యకారులకు అండగా కూటమి!

వేట నిషేధ భృతి విడుదల

ఒక్కొక్కరి ఖాతాలో రూ. 20 వేలు జమ

కృతజ్ఞత చాటుకున్న మత్స్యకారులు

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో :** ఏపీ సీఎం చంద్రబాబు వైఖరిలో స్పష్టమైన మార్పు వచ్చింది. ఆయన పదునైన మాటలతో ఇప్పుడు సత్తా చాటుతున్నారు. సినిమా డైలాగులు సైతం చెబుతున్నారు. నెల్లూరు జిల్లా కావలిలో మత్స్యకారుల భరోసా అందించే కార్యక్రమాన్ని చేపట్టారు. వేట నిషేధ భృతిని విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..' తీరం మనదే.. బోటు మనదే.. వేట మనదే' అంటూ చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మత్స్యకారులకు ఈ డైలాగు ఎంతో ఆకట్టుకుంటుంది.

మిగతా 2లో




# గ్రామకంఠం భూములకు విముక్తి!

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంటోంది. అందులో భాగంగా గ్రామకంఠం భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గ్రామకంఠం పరిధిలో ఇల్లు, వారసత్వంగా వచ్చిన స్థలాలు, ఇతర భూముల రిజిస్ట్రేషన్ లు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఒకవేళ గ్రామ కంఠంలోని భూములు నిషేధ జాబితాలో ఉన్నా సరే.. స్థానిక సంస్థలు ఇచ్చే ధ్రువపత్రాలతో వాటికి విముక్తి కల్పించాలని ఉత్తర్వులు జారీచేసింది. ఇంటి పన్ను, ఖాళీ స్థలం పన్ను రసీదులను పరిశీలించి రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశించింది. ఎందుకు సంబంధించిన మార్గదర్శకాలను కూడా జారీ చేసింది.

**ఎన్నో ఏళ్లుగా సమస్య..**

గ్రామంలోని నివాస ప్రాంతాలను గ్రామ కంఠం భూములు అంటారు. 2015లో గ్రామకంఠం భూములను 22ఏ నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగించారు. అయితే ప్రభుత్వ సామాజిక అవసరాలకు కేటాయించిన భూములకు ఎటువంటి మినహాయింపు లేదు. గ్రామకంఠంగా నమోదయినవి అంటే సర్వే



నంబర్లు 22 ఏ లో ప్రభుత్వ భూమిగా కనిపిస్తూ ఉంటుంది. గ్రామకంఠం భూములకు సంబంధించిన పాత నివాస ప్రాంతాలకు సంబంధించిన ఆస్తుల వివరాలు రెవెన్యూ రికార్డుల్లో కనిపించవు కూడా. కొంతమందికి పాత ఇళ్ల స్థలాలు వారసత్వంగా వస్తాయి. వాటికి లింక్ డాక్యుమెంట్ ఉండదు. గ్రామకంఠంగా భావించి ఆ స్థలాల రిజిస్ట్రేషన్లు కూడా జరగవు. అటువంటి వాటికి తాజాగా విముక్తి కల్పించింది ఏపీ ప్రభుత్వం.

**సానుకూల నిర్ణయం..**

ప్రజల నుంచి వచ్చిన వినతుల మేరకు ఈ సమస్యపై దృష్టి పెట్టింది కూటమి ప్రభుత్వం. అందుకే సరికొత్తగా ఉత్తర్వులు జారీ చేసింది. మార్గదర్శకాలను సైతం విడుదల చేసింది. ఆయా భూములకు సంబంధించిన సర్వే నంబర్ నిషేధిత ఆస్తుల జాబితాలో ఉందా? లేదా అనేదానిపై సంబంధం లేదు. తప్పకుండా రిజిస్ట్రేషన్ చేయాల్సిందేనని ఆదేశాలు ఇచ్చింది. ఒకవేళ ఆయా భూమి, నివాసం గ్రామకంఠం సర్వే నంబర్ లో భాగమనే లింక్ డాక్యుమెంట్లు ఉంటే రిజిస్ట్రేషన్ కోసం దానిని అంగీకరించాల్సిందే. ఒకవేళ ఇల్లు ఉండి లింక్ డాక్యుమెంట్ లేకపోతే ఇంటి పన్ను రసీదు తో రిజిస్ట్రేషన్ చేయాల్సిందే. ఒకవేళ వంశపారంపర్యంగా పట్టణ ప్రాంతాల్లో ఖాళీ స్థలాలకు లింక్ డాక్యుమెంట్లు లేకపోతే.. ఇంటి పన్ను రసీదు, స్థలాలకు కట్టిన పన్ను రసీదుతో రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించింది ప్రభుత్వం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమందికి ఈ నిర్ణయంతో మేలు జరగనుంది.

# చంద్రబాబుతో బాలినేని భేటీ!

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీలో కీలక రాజకీయ పరిణామం జరిగింది. ఇప్పటివరకు రాజకీ యంగా విభేదించుకుంటూ వచ్చిన ఇద్దరు నేతలు కలిశారు. ఏపీ సీఎం చంద్రబాబును మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి కలవడం ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పి జనసేనలో చేరారు బాలినేని. ఆయన హఠాత్తుగా వచ్చి అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. వీరి మధ్య కీలక చర్చలు జరిగినట్టు ప్రచారం నడుస్తోంది.

**వైయస్ కుటుంబ ఆప్తుడిగా..**

బాలినేని శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. రాజశేఖర్ రెడ్డి కుటుంబానికి సమీప బంధువు కావడంతో చంద్రబాబుపై గతంలో చాలా రకాల విమర్శలు చేశారు. రాజశేఖర్ రెడ్డి ప్రోత్సాహంతో 1999లో టికెట్ దక్కించుకున్నారు బాలినేని. ఆ ఎన్నికల్లో గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2004లో సైతం రెండోసారి గెలిచారు. 2009లో మూడోసారి గెలవడంతో మంత్రిగా అవకాశం ఇచ్చారు రాజశేఖర్ రెడ్డి. కానీ ఆయన అకాల మరణంతో బాలినేని శ్రీనివాస్ రెడ్డి జగన్ వెంట అడుగులు వేశారు. మంత్రి పదవిని వదులుకొని మరి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2014 ఎన్నికల్లో ఓడిపోయిన బాలినేనికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు జగన్. 2019లో గెలవడంతో తన మంత్రివర్గంలో అవకాశం కల్పించారు. ఐదేళ్ల వైసిపి పాలనలో బాలినేని శ్రీనివాస్ రెడ్డి టిడిపి పై తీవ్ర విమర్శలు చేశారు. చంద్రబాబు పై తీవ్ర స్థాయిలో మండిపడేవారు. వైసిపి తలుపులు తెరిస్తే టిడిపిలో చంద్రబాబు మాత్రమే ఉండిపోతారని అప్పట్లో కామెంట్స్ చేశారు. అయితే అనుకోని రీతిలో జనసేనలో చేరిన ఆయన టిడిపితో పని చేయాల్సి వచ్చింది.

**రాజకీయంగా గడ్డు పరిస్థితులు..**

ప్రస్తుతం బాలినేని శ్రీనివాస్ రెడ్డి రాజకీయంగా గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఎదిగారు. జగన్మోహన్ రెడ్డికి అత్యంత ఆప్తుడు కూడా. అటువంటి నేత వ్యక్తిగత అవసరాలతో జనసేనలో చేరినట్లు ఆరోపణలు ఉన్నాయి. జనసేన తో పాటు టిడిపి కూటమి ఆయనను అంత సులువుగా నమ్మలేదు కూడా. పైగా ఒంగోలు నియోజక వర్గంలో టిడిపి ఎమ్మెల్యేతో పాటు జనసేనలోని ఒక వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అందుకే బాలినేని తిరిగి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోతారన్న ప్రచారం నడుస్తోంది. కానీ ఇటీవల మీడియా ముందు పూర్తి స్పష్టతనిచ్చారు. ఈ ప్రచారం వెనుక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హస్తం ఉందని ఆరోపించారు. ఇప్పుడు చంద్రబాబుతో నేరుగా కలవడం వల్ల తనపై ఉన్న అనుమానాలను నివృత్తి చేసుకునేందుకేనని పొలిటికల్ వర్గాల్లో ఒక చర్చ ఉంది. తాను టిడిపి తో పాటు జనసేనకు గౌరవించి వచ్చానన్న సంకేతాలు ఇచ్చేందుకే చంద్రబాబును కలిసినట్లు స్పష్టమవుతోంది.

# తెలంగాణ కేబినేట్ భేటీ 23కు వాయిదా ?

(మొదటి పేజీ తరువాయి)

యాదగిరిగుట్టలో కేబినేట్ నిర్వహించేందుకు ఆదేశంచినట్లు తెలుస్తోంది. ఈ నెల 21 జరగాల్సిన కేబినేట్ సమావేశాన్ని 23న నిర్వహించాలని, అదికూడా యాదాద్రిలో నిర్వహించనున్నట్లు సమాచారం. 21 నుంచి సరస్వతీ అంత్య పుష్కరాల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ రాజకీయాలు, పాలనా నిర్ణయాల్లో ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహణ అత్యంత ఆసక్తికరంగా మారింది. ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం కాకుండా, కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేసే యోచనలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి ప్రధాన కారణం ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసరలో ప్రారంభం కానున్న 'సరస్వతి అంత్య పుష్కరాలు' కావడం గమనార్హం. అదే సమయంలో, ఈ కేబినెట్ భేటీని కేవలం వాయిదా వేయడమే కాకుండా, హైదరాబాద్ వెలుపల మరో ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టలో నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు సమాచారం. 'బాసర సరస్వతి అంత్య పుష్కరాలు' ఈ నెల 21వ తేదీన ప్రారంభం కానున్నాయి. గోదావరి నది తీరాన వెలసిన బాసర క్షేత్రంలో జరిగే ఈ అంత్య పుష్కరాలకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ చరిత్రాత్మక వేడుకకు రాష్ట్ర మంత్రివర్గంలోని మెజార్టీ మంత్రులు హాజరు కానున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటం, పుష్కరాల పనులను పర్యవేక్షించడం మంత్రులకు విధిగా మారింది. మంత్రులంతా పుష్కరాల పనుల్లో, అధికారిక పర్యటనల్లో నిమగ్నమవ్వడం, బాసరకు వెళ్లనుండటంతో.. అదే రోజు నిర్వహించాలనుకున్న కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేయడమే ఉత్తమమని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. దీంతో ఈ నెల 23వ తేదీన ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట లో కేబినెట్ సమావేశాన్ని నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి యోచిస్తున్నారు. రాజధాని హైదరాబాద్‌లోని సచివాలయానికే పరిమితం కాకుండా, ప్రజలకు, పుణ్యక్షేత్రాలకు దగ్గరగా పాలనను తీసుకెళ్లాలనే ఆలోచనలో భాగంగానే ఈ వ్యూహాన్ని రచిస్తున్నారు. యాదగిరి లక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్న ఈ పవిత్ర క్షేత్రంలో కేబినెట్ భేటీ నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మిక, రాజకీయ సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లవచ్చని సీఎం భావిస్తున్నారు.

# తమిళనాడులో స్టాలిన్ మైండ్ గేమ్!

విజయ్ నేతృత్వంలోని నూతన ప్రభుత్వం తుమ్మితే ఊడిపోయే ముక్కు లాంటిదని.. ఎంతో కాలం నిలవదని ఆయన వేసిన సెటైర్స్ ఇప్పుడు తమిళనాడు పొలిటికల్ సర్కిల్స్లో సెగలు రేపుతున్నాయి. ప్రభుత్వం ఎప్పుడైనా పడిపోవచ్చు కాబట్టి.. డీఎంకే క్యాడర్ సిద్ధంగా ఉండాలని స్టాలిన్ ఇస్తున్న పిలుపు ఇప్పుడు హాట్ టాపిక్ అవుతోంది.

**సోషల్ మీడియా హైప్ తోనే...**

ఎటువంటి భారీ అంచనాలు లేకుండా విజయ్ సాధించిన విజయం వెనుక డిజిటల్ మీడియా హైప్ తప్ప .. క్షేత్రస్థాయి కష్టం లేదని స్టాలిన్ విమర్శిస్తున్న తీరు ఇప్పుడు ఆలోచనలో పెడుతోంది. కనీసం బూత్ ఏజెంట్లను కూడా పెట్టుకోలేని ఒక పార్టీ ఎలా గెలిచిందో అందరికీ తెలుసునంటూ.. ఈ గెలుపు క్రెడిట్ మొత్తాన్ని కేవలం ఇన్స్టాగ్రామ్, సోషల్ మీడియా కే కట్టబెట్టారు స్టాలిన్. సోషల్ మీడియాలో పిల్లలను, వృద్ధులను వాడుకొని తాత్కాలికంగా సృష్టించిన ఈ ఇమేజ్.. త్వరలో పడిపోతుందని కూడా చెప్పుకొచ్చారు స్టాలిన్. పాలనలో లోపాలు బయటపడగానే జనం వాస్తవాలు గ్రహిస్తారని స్టాలిన్ తన కేడర్ లో నూతన ఉత్సాహాన్ని నింపే ప్రయత్నం చేశారు.

**విజయ్ ప్రభుత్వాన్ని కాపాడుతూనే..**

డీఎంకే అధినేత స్టాలిన్ ఒక వ్యూహం ప్రకారమే ఈ వ్యాఖ్యలు చేస్తున్నట్లు స్పష్టం అవుతుంది. సర్వసాధారణంగా స్టాలిన్ ఓపెన్ కారు. తనకు అనుకూలమైన వాతావరణం ఉండే సమయంలో సైతమే ఆయన సంచలన ప్రకటనలు చేస్తారు. ఒకవేళ ఏదైనా ఊహించని రాజకీయ సంక్షోభం తలెత్తి.. విజయ్ ప్రభుత్వానికి ముప్పు వాటిల్లితే తక్షణమే ఎన్నికలకు వెళ్లడం కంటే.. విజయ్ ప్రభుత్వాన్ని కాపాడేందుకే స్టాలిన్ మొగ్గు చూపుతారు. 2029 సార్వత్రిక ఎన్నికలు ఎలాగూ ఉన్నాయి. ఆ సమయం వరకు ఒక అస్తిత్వ వాతావరణాన్ని సృష్టించి రాజకీయ ప్రయోజనం పొందాలన్నది స్టాలిన్ వ్యూహంగా అర్థం అవుతుంది. విజయ్ నేతృత్వంలోని టీవీకే అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే స్టాలిన్ ఈ ప్రభుత్వం పడిపోతుందని వ్యాఖ్యానించడం వెనుక పక్క వ్యూహం ఉంది. ఒకటి డీఎంకే శ్రేణుల్లో ధైర్యం నింపేందుకు. రెండు రాజకీయంగా విజయ్ ను అస్థిరపరిచేందుకు. మరి స్టాలిన్ వ్యూహాలు మున్ముందు ఎలా ఉండబోతున్నాయో చూడాలి.

# బండి భగీరథ్ కేసులో మరో సిట్!

ఈ దుష్ప్రచారం సాగుతోంది. అయితే ఈ ప్రచారం వెనుక ఉన్న సూత్రధారులను పట్టుకునేందుకు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేసేందుకు జాయింట్ కమిషనర్ శ్వేతా నేతృత్వంలో ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

**ప్రధాన నిందితుడి అరెస్ట్..**

అయితే సోషల్ మీడియాలో ఏకంగా జడ్జిపై జరుగుతున్న ఈ ప్రచారం వెనుక ఒక ముఠా ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ప్రధాన నిందితుడిగా భావిస్తున్న దామోదర్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. బండి భగీరథ్ కు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే.. దాని ప్రతిఫలంగా సదరు హైకోర్టు జడ్జి భర్తకు కీలకమైన చైర్మన్ పదవి ఇస్తారంటూ కొన్ని ఐటీ సెల్స్ , సోషల్ మీడియా అకౌంట్ల ద్వారా అనుచిత ఆరోపణలతో కూడిన కథనాలను సర్కులేట్ చేశారు. ఈ వ్యవహారంపై హైకోర్టు రిజిస్ట్రార్ తీవ్రంగా పరిగణించి పోలీస్ స్టేషన్లోనే అధికారికంగా ఫిర్యాదు చేశారు. పోలీస్ శాఖ తీవ్ర నేరంగా పరిగణించి ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది.

**జడ్జి తీవ్ర ఆవేదన..**

ఇటీవల ముందస్తు బెయిల్ పిటిషన్ పై విచారణ జరిగిన సంగతి తెలిసిందే. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవి దేవి ఈ సోషల్ మీడియా లో జరుగుతున్న దుష్ప్రచారంపై ఆవేదన వ్యక్తం చేశారు. చట్ట ప్రకారం మెరిట్స్ ఆధారంగానే కోర్టులు నిర్ణయం తీసుకుంటాయని చెప్పుకొచ్చారు. ఇటువంటి అవాస్తవ ప్రచారాలు కలిసి వేస్తున్నాయంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఈ కేసులో బాధితురాలి గోప్యతకు భంగం కలిగించేలా సోషల్ మీడియాలో ఫోటోలు, వీడియోలు వైరల్ చేస్తున్నారు. దీనిని కూడా పోలీస్ శాఖ సీరియస్ గా పరిగణించింది. అయితే ఇప్పటికే ఈ కేసులో దర్యాప్తు బృందం విచారణ చేపడుతుండగా.. సమాంతరంగా సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై మరో సిట్ విచారణ కొనసాగిస్తోంది.

# వచ్చే ఎన్నికల్లో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పోటీ!

(మొదటి పేజీ తరువాయి)

అందులో భాగంగానే బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి క్షేత్రస్థాయిలో రంగంలోకి దిగినట్లు పొలిటికల్ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది.

**అనతి కాలంలోనే గుర్తింపు..**

రాజకీయాల్లోకి అడుగుపెట్టిన అతి తక్కువ కాలంలోనే తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి. అధినేత జగన్మోహన్ రెడ్డి పట్ల విధేయతను చూపడంలో ముందు వరుసలో ఉంటారు సిద్ధార్థ రెడ్డి. నందికొట్కూరు నియోజకవర్గంలో 2019లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుతో తనకంటూ ఒక ఇమేజ్ ను క్రియేట్ చేసుకున్నారు. అయితే అప్పటివరకు రాయలసీమలో మాత్రమే గుర్తింపు ఉండేది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కూడా తనకంటూ ఒక ప్రత్యేక ఇమేజ్ను సొంతం చేసుకున్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో కీలకమైన శ్యాప్ చైర్మన్ పదవిని దక్కించుకున్నారు. 2024 ఎన్నికల్లో ఎంపీగా కానీ.. ఎమ్మెల్యేగా కానీ పోటీ చేయాలని భావించారు. అందుకు సమీకరణలు కుదరలేదు. కానీ 2029 ఎన్నికల్లో మాత్రం కచ్చితంగా బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి వైసీపీ తరఫున బరిలోకి దిగుతారని అర్థం అవుతుంది.

**మొన్నటి ఎన్నికల్లో పోటీకి ప్రయత్నం..**

వాస్తవానికి 2024 ఎన్నికల్లోనే ఆయన పేరు ప్రముఖంగా వినిపించింది. శ్రీశైలం నుంచి కానీ.. పాణ్యం నియోజకవర్గం నుంచి కానీ పోటీ చేసే అవకాశం ఉన్నట్లు అప్పట్లో టాక్ నడిచింది. లేకుంటే నంద్యాల ఎంపీగా అవకాశం దక్కుతుందని అంతా భావించారు. కానీ చివరి నిమిషంలో మాత్రం ఆయన పేరు లేకుండా పోయింది. పార్టీ స్టార్ క్యాంపెయినర్ గా అభ్యర్థుల కు మద్దతుగా ప్రచారం చేశారు ఆ ఎన్నికల్లో. పార్టీ ఓడిపోయిన తర్వాత కూడా రాయలసీమలో చాలా యాక్టివ్ గా పని చేస్తున్నారు సిద్ధార్థ రెడ్డి. జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతోనే ఎప్పటికప్పుడు కూటమిని ఎండగడుతున్నారు.

**సుదీర్ఘ నేపథ్యం..**

ప్రస్తుతం నంద్యాల ఎంపీగా బైరెడ్డి శబరి ఉన్నారు. ఆమె స్వయాన తన పెదనాన్న బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి కుమార్తె. వీరి కుటుంబానికి మంచి నేపథ్యం ఉంది. బైరెడ్డి శేష శయనా రెడ్డి తెలుగుదేశం పార్టీలో ఎమ్మెల్యేగా ఉంటూ మంత్రి అయ్యారు. ఆయన కుమారుడు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి టిడిపి తరఫున ఎమ్మెల్యేగా కూడా గెలిచారు. కానీ 2014 ఎన్నికల కు ముందు తన పెదనాన్న రాజశేఖరరెడ్డి తో కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు సిద్ధార్థ రెడ్డి. కానీ తరువాత జరిగిన పరిణామాలతో రాజశేఖర్ రెడ్డి తిరిగి బిజెపిలో చేరారు. సిద్ధార్థ రెడ్డి మాత్రం వైసిపి లోనే ఉండిపోయారు. ఇప్పటికీ అదే పార్టీలో కొనసాగుతూ వస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి నంద్యాల ఎంపీగా పోటీ చేయడం ఖాయమని తెలుస్తోంది. లేకుంటే మంత్రి టీజీ భరత్ పై ప్రయోగిస్తారని కూడా సమాచారం. మరి జగన్ ఆలోచన ఎలా ఉండబోతుందో చూడాలి.

# ఇందిరమ్మ ఇంటి కోసం మహిళకు వేధింపులు

## కాంగ్రెస్ నేతపై పోలీసుల కేసు నమోదు

కామారెడ్డి:ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తానని నమ్మబలికి, దానికి ప్రతిఫలంగా తన కోరిక తీర్చాలంటూ ఓ మహిళను వేధించిన ఘటన కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితురాలు ఫిర్యాదు మేరకు రాజంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం రాజంపేట మండల కేంద్రం చెందిన ఒక మహిళకు ఇందిరమ్మ ఇండ్లు కావాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన సదరు నాయకుడిని సంప్రదించింది. అయితే ఇల్లు మంజూరు చేయాలంటే తన కోరిక తీర్చాలని, తనకు లొంగిపోవాలని అతడు ఆమెను తీవ్రంగా వేధించడం ప్రారంభించాడు. ఈ వేధింపులు తట్టుకోలేక బాధితురాలు చివరికి రాజంపేట పోలీస్టేషన్లో ఫిర్యాదు చేసింది.

# మత్స్యకారులకు అండగా కూటమి!


**రెండు నెలలు వేట నిషేధం..**

ఏటా ఏప్రిల్ 15 నుంచి.. జూన్ 14 వరకూ అంటే దాదాపు 60 రోజులు సముద్రంలో చేపల వేట నిషేధం అమల్లో ఉంటుంది. చేపల ఉత్పత్తి సమయం కావడంతో.. మర బోట్లతో వేట నిషేధం. ఆ సమయంలో మత్స్యకారులకు ఒక్కొక్క కుటుంబానికి 20వేల రూపాయల చొప్పున ప్రభుత్వం భృతిగా అందిస్తూ వచ్చింది. ఆ కార్యక్రమానికి గాను మంగళవారం సీఎం చంద్రబాబు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది మత్స్యకారుల ఖాతాలో నిధులు జమ చేశారు. ఈ సందర్భంగా మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న సేవలను గుర్తు చేశారు. మత్స్యకారుల జీవనోపాధి పెంచేందుకు అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. సముద్రపు నాచు పెంపకం, తీరప్రాంతరక్షణకు ప్రత్యేకంగా గోడలు నిర్మించడం, మొక్కలు నాటడం, తీరం వెంబడి సోలార్ లైట్లు వేయడం వంటి వాటిని గుర్తు చేశారు. తీరం వెంబడి హార్బర్లతో పాటు పోర్టులు, జట్టీలు సైతం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.




**బోట్లు, పడవలతో ర్యాలీ..**

మరోవైపు ఏపీ సీఎం చంద్రబాబు పట్ల కృతజ్ఞత చాటుకున్నారు మత్స్యకారులు. కృష్ణా నదిలో పెద్ద సంఖ్యలో బోట్లు, పడవలతో సీఎం చంద్రబాబు ఇంటి వరకు కృతజ్ఞతా ర్యాలీ నిర్వహించారు. రాజధాని అమరావతి ప్రాంతాలైన వెంకటపాలెం, తుమ్మలపాలెం, సీతానగరం, కుమ్మరపాలెం లకు చెందిన మత్స్యకారులు సుమారు 100బోట్లతో కృష్ణా నదిపై ర్యాలీ నిర్వహించారు. నారా లోకేష్ వారికి అభివాదం చేస్తూ తన ఇంటికి ఆహ్వానించారు. మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు లోకేష్.





# భూ తల్లి గుండెల్లో గుణపపు పోటు..

# చెన్నారం చెరువులో నిలువుదోపిడీ!

లక్షల సొమ్ము దళారుల పాలు.. చెరువు పూడికతీత పేరిట పగటి దొంగతనం!

కాసుల కక్కుర్తిలో అధికారులు.. వందల టిప్పర్లతో చెన్నారంలో జాతర!?

రైతుల పేరిట ఇటుక బట్టీల దందా.. చెరువు కట్టకే ఎసరు పెట్టిన కాంట్రాక్టర్లు!

అటకెక్కింది ప్రజాపాలన.. ప్రైవేట్ కాంట్రాక్టర్‌కు సర్పంచ్ సరికొత్త సేవలు!?

నియోజకవర్గం ప్రజాప్రతినిధి పేరుతో బుకాయింపు.. నిజానికి ఆయన హస్తం ఉందా..!?

కంటికి కనపడని మైనింగ్, ఇరిగేషన్ అధికారులు.. అనుమతులు రద్దు చెయ్యాలంటూ డిమాండ్..

ప్రజాపాలన నినాదం గాలికి ఎగిరిపోయింది. కాంట్రాక్టర్ల అక్రమ సంపాదనకు, దళారుల కాసుల కక్కుర్తికి చెన్నారం చెరువు నిలువునా బలైపోతోంది..! చెరువుల పూడికతీత, అభివృద్ధి పనుల పేరిట, లక్షలాది రూపాయల ప్రభుత్వ సొమ్ము పక్కదారి పడుతుండగా, మరోవైపు చెరువులోని అత్యంత సారవంతమైన నల్లమట్టిని, ఇటుక బట్టీలకు తరలిస్తూ ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. మూడు భారీ ఇటాచీలు, సుమారు వందకు పైగా టిప్పర్లతో ఈ అక్రమ దందా, రాత్రింబగళ్లు మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. రైతుల పొట్టగొట్టి, ఇటుక బట్టీల యజమానులకు లాభం చేకూరుస్తున్న, ఈ దందాను అడ్డుకోవాల్సిన ప్రభుత్వ యంత్రాంగం, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది.

**నల్లగొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్)**



**ఒకే వేబిల్లుతో రోజంతా బిజినెస్.. అధికారుల హస్తం?**

ఈ అక్రమ రవాణాలో మైనింగ్ నిబంధనలు పూర్తిగా తుంగలో తొక్కారు. ఉదయం తీసుకున్న ఒకే ఒక్క వేబిల్లుతో రోజంతా వందలాది టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తూ పగటి దోపిడీకి తెరలేపారు.!? నియోజకవర్గ ప్రజాప్రతినిధికి అత్యంత దగ్గర అంటూ, ఓ అధికారి హస్తం ఈ దందా వెనుక ఉందని, ఆయన వెంటే మరో ఫైర్ అధికారి కూడా ఉంటూ, ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నారని స్థానికంగా బలమైన ఆరోపణలు వస్తున్నాయి.? ఉన్నతాధికారుల అండదండలు, రాజకీయ పలుకుబడి ఉండబట్టే మైనింగ్, ఇరిగేషన్ అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదని స్పష్టమవుతోందని ప్రజలు అనుకుంటున్నారు..!

## చెరువు కట్టకే ఎసరు.. బలహీనపడుతున్న చెన్నారం చెరువు!

నిబంధనల ప్రకారం చెరువు మధ్యలో పూడిక తీయాల్సి ఉండగా, కాంట్రాక్టర్లు తమ స్వలాభం కోసం చెరువు కట్టకు అత్యంత సమీపంలో భారీ గోతులను తవ్వుతున్నారు. దీనివల్ల రాబోయే వర్షాకాలంలో చెరువు కట్ట బలహీనపడి, తెగిపోయే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది.! రైతుల సాగునీటి అవసరాల కోసం నిర్మించిన ఈ చెరువుకు కాంట్రాక్టర్లు "బోడిగుండు" కొడుతుంటే, స్థానిక రైతాంగం తమ భవిష్యత్తుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. ప్రజల పక్షాన నిలబడాల్సిన స్థానిక సర్పంచ్, ప్రజాపాలనను పూర్తిగా విస్మరించి ప్రైవేట్ కాంట్రాక్టర్లకు సేవకుడిగా మారారనే విమర్శలు వినపడుతున్నాయి..? ఈ అక్రమ తవ్వకాలకు సంబంధించి గ్రామ పంచాయతీ చేసిన తీర్మానంపై, అనేక అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.!? సర్పంచ్ స్వయంగా దగ్గరుండి మరీ ఈ పనులను చేయిస్తుండటం వెనుక, ఉన్న అసలు రహస్యం ఏమిటో ఉన్నతాధికారులే తేల్చాల్సి ఉంది.





## ధ్వంసమైన రోడ్లు.. దుమ్ము, ధూళితో నరకప్రాయం!

అమితమైన లోడుతో, మితిమీరిన వేగంతో ఊరి గుండా ప్రయాణిస్తున్న, వందలాది టిప్పర్ల కారణంగా స్థానిక రోడ్లన్నీ పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఎక్కడ చూసినా గుంతలు తేలి, దుమ్ము, ధూళి లేచి గ్రామస్థుల జీవనం నరకప్రాయంగా మారింది. చిన్న పిల్లలు, వృద్ధులు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. చెన్నారం చెరువులో జరుగుతున్న అక్రమ తవ్వకాలను, ఇటుక బట్టీలకు తరలిస్తున్న నల్లమట్టి రవాణాను, జిల్లా కలెక్టర్, మైనింగ్ ఉన్నతాధికారులు వెంటనే, జోక్యం చేసుకుని తక్షణమే నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమాలను కళ్లారా చూస్తూ కూడా కాసుల కక్కుర్తితో, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ఇరిగేషన్, మైనింగ్ అధికారులపై తక్షణమే విచారణ జరిపి, వారిని సస్పెండ్ చేయాలని, సర్పంచ్, దళారులపై, గ్రామ పంచాయతీ తీర్మానంపై సమగ్ర విచారణ జరిపి, కాంట్రాక్టర్లతో చేతులు కలిపిన సంబంధిత ప్రజా ప్రతినిధిపై, దళారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.!? ?ప్రభుత్వ సంపదను కొల్లగొడుతూ, రైతుల పొట్టగొడుతున్న ఈ దందాను, అధికారులు వెంటనే ఆపలని కోరుతున్నారు.. ఇంతకీ అనుమతులు ఎంత పరిమాణానికి ఉంది.. ప్రస్తుతం ఎంత తవ్వుకున్నారు.. ఇంకా ఎంత పరిమాణం మిగిలి ఉంది, అనే అంశాలను ఎవరు చూడాలి..? పర్యవేక్షణ చెయ్యాల్సిన అధికారులు ఫీల్డ్ లో ఎందుకు లేరు.. దీనిపై అసలు మతలబు ఏంటని అనేకులు ప్రశ్నిస్తున్నారు..!? ఇష్టానుసారంగా తవ్వుతున్న ఈ తవ్వకాలను ఆపేదెవరని, స్థానిక ఎమ్మెల్యే దీనిపై నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు..

# యుద్ధప్రాతిపదికన పాలమూరు-రంగారెడ్డి భూసేకరణ

(మొదటి పేజీ తరువాయి)

భూసేకరణ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తామని సీఎం చెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్‌సీఆర్‌హెచ్‌ఆర్డీలో సమావేశమయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి సీఎం కీలక సూచనలు చేశారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ భేటీలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, రాకేశ్ రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు.

# రాజకీయాల్లోకి భూమా మౌనిక!



ప్రారంభంలో తెలుగుదేశం పార్టీకి సేవలందించిన ఆయన తర్వాత పార్టీకి గుడ్ బై చెప్పారు. మధ్యలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరినట్టే చేరి రాజకీయాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. ఇప్పుడు ఆయన కుటుంబం నుంచి రెండో కోడలు భూమా మౌనిక రెడ్డి పొలిటికల్ ఎంట్రీ ఇస్తారని ప్రచారం నడుస్తోంది. దీనిపై ఆమె భర్త మంచు మనోజ్ ఫుల్ క్లారిటీ ఇచ్చారు.

### మంచి నేపథ్యం..

రాయలసీమ రాజకీయాల్లో చక్రం తిప్పింది భూమా కుటుంబం. నంద్యాల తో పాటు ఆళ్లగడ్డ ప్రాంతంలో బలమైన రాజకీయ బలం ఉంది ఆ కుటుంబానికి. భూమా నాగిరెడ్డి, శోభ నాగిరెడ్డిలు ఈ ప్రాంతంలో బలమైన రాజకీయ ముద్ర వేశారు. ప్రస్తుతం ఆ కుటుంబం నుంచి భూమా దంపతుల పెద్ద కుమార్తె అఖిల ప్రియా రాజకీయాల్లో ఉన్నారు. ఆళ్లగడ్డ నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇప్పుడు ఆమె సోదరి, మంచు మనోజ్ భార్య మౌనిక రెడ్డి సైతం పొలిటికల్ ఎంట్రీ ఇస్తారని ఫుల్ క్లారిటీ వచ్చింది.. ఈ విషయాన్ని ఆమె భర్త మంచు మనోజ్ ప్రకటించారు.

### సేవా కార్యక్రమాలతో..

ఇటీవల మంచు మనోజ్, మౌనిక రెడ్డి దంపతులు సంయుక్తంగా ఐక్య ధైర్య సేన సమితి సేవా సంస్థను ప్రారంభించారు. అయితే అది రాజకీయ ప్రయోజనాల కోసమే అంటూ వస్తున్న ప్రచారాన్ని ఖండించారు మంచు మనోజ్. కేవలం పేదలకు సేవ చేయడానికి ఈ సంస్థ అంటూ స్పష్టం చేశారు. అదే సమయంలో తన భార్య మౌనిక రాజకీయాల్లోకి వస్తారని.. వచ్చే ఎన్నికల్లో బరిలో ఉంటారని స్పష్టత ఇచ్చారు. ప్రస్తుతం ఆమె సోదరి అఖిలప్రియ ఎమ్మెల్యేగా ఉన్నారు. అయినా సరే చిన్ననాటి నుంచి రాజకీయ వాతావరణం లో పెరిగిన మౌనిక సైతం అటువైపు ప్రయాణం చేస్తానని తేల్చి చెబుతున్నారు.

### మంచి దూకుడు కలిగిన నేతగా..

మౌనిక అటు భూమా కుటుంబం నుంచి.. ఇటు మంచు కుటుంబం నుంచి రాజకీయ వారసురాలిగా నిలిచే అవకాశం ఉంది. ఆమె కేవలం మంచు వారి కోడలు కాదు. క్షేత్రస్థాయిలో బలమైన రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన మహిలుగా కూడా గుర్తింపు ఉంది. భూమా నాగిరెడ్డి చనిపోయిన తర్వాత జరిగిన ఉప ఎన్నికల సమయంలో అఖిల ప్రియ కోసం గర్భిణిగా ఉన్న ఆమె ప్రచారం చేశారు. మంచి వాగ్దాటితోపాటు దూకుడు కలిగిన మహిళ నేతగా గుర్తింపు సాధించారు. ఇప్పుడు సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ అవుతున్నారు. అయితే ఆమె తెలుగుదేశం పార్టీ నుంచి కానీ.. జనసేన నుంచి కానీ పోటీ చేస్తారని తెలుస్తోంది. కొద్ది రోజుల్లో దీనిపై క్లారిటీ రానుంది.

# తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

**ఉద్యోగులు, పెన్షనర్ల కోసం హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు**

**ఈ నెల 31 లోపు పోర్టల్‌లో ఉద్యోగుల వివరాలు నమోదు**

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కొత్తగా ఎంపాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసింది. ఈ కొత్త హెల్త్ స్కీమ్ అమల్లో భాగంగా రాష్ట్ర ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అన్ని ప్రభుత్వ శాఖలకు అత్యవసర ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకం ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు వైద్య భద్రత కల్పించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంగా తెలుస్తోంది. ఉద్యోగుల ఆరోగ్య సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల పూర్తి సమాచారాన్ని సేకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించింది. ఫైనాన్స్ శాఖ సూచనల ప్రకారం ప్రతి ఉద్యోగి, పెన్షనర్ తమ కుటుంబ సభ్యుల వివరాలతో సహా పూర్తి డేటాను తప్పనిసరిగా సమర్పించాలి.




క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

ఎడిటోరియల్

4

బుధవారం

20-5-2026

## ఎడిటోరియల్

# ఆర్థిక కార్యాచరణ అత్యవసరం!

**నాలుగు రాష్ట్రాలఅసెంబ్లీ ఎన్నికలు ముగిశాక బిజెపిలో కనిపించినంత ఆనందం మిగతా పార్టీల్లో కనిపించలేదు. కేరళలో అధికారం దక్కించుకున్నా కూడా కాంగ్రెస్ లో అంతటి ఆనందం కనిపించలేదు. బెంగాల్ దక్కడంతో బిజెపిలో ఎక్కడలేని ఆనందం, ఉత్సాహం కనిపించింది. ఆ ఆనందాన్ని ప్రజలతో పంచుకునేందుకు బిజెపి సిద్ధంగా లేదు. ఎందుకంటే పెట్రో,డీజిల్ ధరలు పెంచడం, ఆర్థిక వ్యవస్త రోజురోజుకూ కుదేలవ్వడంతో ప్రజల్లో ఒకింత నిరాసక్తి కనిపిస్తోంది. కొత్తగా రెండు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఆనందంలో ఉండగానే దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర కష్టనష్టాల నెదుర్కొంటున్న వాస్తవాన్ని గుర్తించారు.**

హైదరాబాద్ పర్యటనలో ఆయన చేసిన వ్యాఖ్యలు రానున్న ముప్పును ముందే గమనించి చేసిన హెచ్చరికగా గుర్తించాలి. ఈ క్రమంలో ఒక్క బంగారం దిగుమతులే కాకుండా దేశీయ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తున్న ఆహార దిగుమతులను కూడా నిలిపి వేయడం మంచిదని ప్రధాని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది. ఆర్థిక వ్యవస్థ రానున్న రోజుల్లో మరింత బలహీనం కానుందన్న కఠోర సత్యాన్ని మోడీ ఒప్పుకున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చేసిన తప్పులకు ప్రజలు త్యాగాలు చేయాలని ప్రధానమంత్రి పిలుసపునిస్తున్నట్లుగా ఉంది. అందువల్ల రాజకీయ నాయకులకు సంబంధించి విప్లవాత్మక మార్పులు తీసుకుని వస్తే తప్ప సంక్షోభాన్ని గట్టెక్కలేమని ప్రధాని మోడీ గుర్తించడం లేదు. ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయెల్ సంయుక్త దాడులతో మొదలు పెట్టిన యుద్ధం ప్రారంభమై ఈ నెలాఖరుకు మూడు నెలలు పూర్తవుతాయి. ఫిబ్రవరి 28న మొదలైన ఈ యుద్ధం ఇప్పట్లో ముగుస్తుందనడానికి లేదు. ట్రంప్ రోజుకో మాట మాట్లాడుతున్నారు. ఆయన తీరు చూస్తుంటే యుద్ధం ఆగిపోయే సూచనలు కానరావడం లేదు. పశ్చిమాసియాలోని దేశాలన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆ యుద్ధంలో పాల్గొంటూనే ఉన్నాయి. ఈ క్రమంలో చమురు సరఫరా నిలిచి పోయింది. హోర్ముజ్ జలసంధి వద్ద అమెరికా ,ఇరాన్‌లు పట్టుబిగించాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 107 డాలర్లుగా ఉన్నది; రూపాయి మారకం విలువ డాలర్‌కు రూ.96కు చేరువలో ఉన్నది. రూపాయి విలువ ఎన్నడూ ఇంతగా పతనం కాలేదు. నిత్యం దాని ధర పతనం అవుతూనే ఉంది. దీనికి కారణం ఇబబడిముబ్బడిగా దిగుమతులే కారణమని చెప్పనక్కరలేదు. విదేశీ మారక నిల్వలు తగ్గిపోతున్నాయి. అధికారికంగా వినియోగ ధరల సూచీ ద్రవ్యోల్బణం 3.5శాతం కాగా ఆహార ద్రవ్యోల్బణం 4.33శాతంగా ఉంది. గృహావసరాల ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.913 కాగా కమర్షియల్ సిలిండర్ ధర రూ.3077 నుంచి రూ.3237 దాకా ఉంటోంది; డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం 8.3శాతంగా ఉంది. ఇవన్నీ కూడా మన ఆర్థిక దౌర్బల్యాన్ని సూచిస్తున్నాయి. నేరుగా ఇవన్నీ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతున్నవని గుర్తించాలి. దీనిని తట్టుకుని నిలబడేందుకు ధరలు పెంచడం మార్గం కాదు. ప్రజల్లో కొనుగోలు శక్తి పెరగడానికి చర్యలు తీసుకోవడం లేదు. దేశీయంగా ఆహార వస్తువులను ప్రజలకు నేరుగా, చౌకగా అందించే ప్రణాళికలు చేయడం లేదు. తెలుగు రాష్ట్రాలను తీసుకుంటే ఇక్కడ వరి, మిర్చి, శనగ,మక్కజొన్న తదితర పంటలు విపరీతంగా పండుతున్నాయి. ఇవి పండిస్తున్న రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. అలాగే కొనుగోలుదారులకు సరసమైన ధరలకు వస్తువులు దక్కడం లేదు. ఈ వ్యత్యాసాన్ని ప్రభుత్వాలు గుర్తించడం లేదు. బంగారం దిగుమతులను నిలిపివేయడంతో పాటే ఇతర నిత్యావసరాల దిగుమతులను కూడా నిలిపివేయాలి. దేశీయంగా పండుతునున్న పంటలకు పోటీగా వస్తున్న ఆహారా ధాన్యాల దగుమతులపై ఆంక్షలు విధించాలి. అలాగే మనవద్ద గోదాముల్లో మూలుగుతున్న ఆహార ధాన్యాలను ఉచితంగా కాకుండా ప్రజలకు సరసమైన ధరలకు అందించాలి. అలాగే అన్ని విషయాలలోను పొదుపు పాటించి తీరాలి. ఇంధన వినియోగం, వంటనూనెలు, ఎరువులు మొదలైన వాటి వినియోగంలో పొదుపు అవసరమే. అందుకోసం అనవసర దిగుమతులను పూర్తిగా నిరోధించాలి. అననింటికి మించి ప్రజాప్రతినిధుల దుబారాలపై ఆంక్షలు విధించాలి. జీతభత్యాలు, ఉచిత పథకాలపైనా కొంతకాలం ఆంక్షలు విధించాలి. ఈ విషయంలో పాలకులు ముఖ్యంగా ప్రధాని మోడీ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. అడ్డూ అదుపూ లేకుండా ఇంధన వినియోగానికి కారణ మవుతున్న కాన్వాయ్‌లను రద్దు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు విదేశీ మారకద్రవ్యం నిల్వలను మళ్లీ సమృద్ధం చేయడానికి కఠిన చర్యలు అవలంబిం చాల్సిందే. ఇవన్నీకూడా ఎమర్జెన్సీ కింద అమలు కావాలి. రూపాయి మారకం రేటును స్థిరీకరించకుంటే మన విదేశీమారక నిల్వలు హరించకు పోతాయి. అందుకోసం రూపాయి మారకం రేటు స్థిరపరచేందుకు అసవరమైన చర్యలను తక్షణం అమలు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమిష్టి నిర్ణయాలు అవసరం. ఆర్థిక నిపుణులతో చర్చించాలి. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి సూచనలు సలహాలు తీసుకోవాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కఠిన చర్యలకు ఉపక్రమించాలి. తక్షణ ప్రాతిపదికన చేపట్టవలసిన చర్యలపై సలహాలు ఇచ్చేందుకు తలపండిన ఆర్థికవేత్త నేతృత్వంలో ఒక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలి. ఇలా గ్రామాల నుంచి పట్టణాల వరకు నిరంతరంగా అభిప్రాయాలను సేకరించి, క్రోడీకరించాలి. మన దేశ వనరులు, వినియోగం, దిగుమతులను విశ్లేషించాలి.

# విధాత తలపున ప్రభవించినది... మానవ జీవనం!

**ఆ అనంత ఆకాశంలో మొట్టమొదటి నక్షత్రాన్ని ఎవరు వెలిగించారు? సమయం అనే నదిని మొదలుపెట్టిన మూలమేదో, అనంతత్వానికి ఒక రూపమిచ్చిన శక్తి ఏదైనా అదే విధాత. ఆ విధాత తలపున ప్రభవించినది ఏమిటో తెలుసా? ఈ మానవుడు! ఈ అద్భుత జీవి. ఈ ఒక్క ప్రశ్నను మనసులో ఉంచుకొని ఈ వ్యాసాన్ని చదివినప్పుడు, జీవితానికి ఒక కొత్త అర్థం, సరికొత్త దృక్పథం అవగతమవుతాయి. ఇదొక అక్షర ప్రయాణం, మన ఉనికిని మనం వెతుక్కునే ఆత్మశోధన.**

**వే**దాలు కాలాతీతంగా ఘోషించాయి అహం బ్రహ్మాస్మి నేనే బ్రహ్మాన్ని. ఉపనిషత్తుల అంతస్సూత్రం చాటింది తత్ త్వమసి అది నీవే. ఆ సత్యాన్ని నిత్యం అనుభవించే మానవుడు ఏనాటి నుంచో ఈ విశ్వం మీద తన చెరగని ముద్ర వేస్తున్నాడు. ప్రతి అడుగులోనూ, ప్రతి ఆలోచనలోనూ, ప్రతి కలలోనూ ఆ విధాత హస్తం వెలుగులీనుతూనే ఉంటుంది. మరి ఆ విధాత తన సృష్టిలో అత్యుత్కృష్టమైన, అత్యంత లావణ్యవంతమైన రచనగా మానవుణ్ణి మలిచినప్పుడు, ఆ సృష్టి వెనుక ఉన్న నిగూఢమైన గొప్పతనాన్ని మనం చెక్కుతాడు. ఒక చిత్రకారుడు రంగుల మేళవింపుతో అనంత ఆకాశాన్ని కాన్వాస్ పై అద్భుతంగా దింపుతాడు. ఒక కవి తన పదునైన పదాల ద్వారా ప్రవాహమయిన భావాలను పాఠకుల హృదయాలలో శాశ్వతంగా నింపుతాడు. అసలు ఇవన్నీ ఏమిటి? ఇవి విధాత తన అంతరంగంలో దాచుకున్న పరంజ్యోతి లాంటి సౌందర్యాన్ని మానవుని సృజన ద్వారా ఈ బాహ్య ప్రపంచానికి చూపిస్తున్న తీరు. కళ అనేది విధాత యొక్క మూగ భాష. మానవుడు ఆ రసభాషను నేర్చుకున్నప్పుడు, విధాత హృదయ స్పందన ఏమిటో జగత్తుకు వ్యక్తమవుతుంది.మన తెలుగు భూమి ఈ మానవుని అంతరంగంలో ఒక అమోఘమైన, చెరగని శక్తిని నాటాడు అదే ఆశ . ఆ ఆశే మానవుడిని చీకటి నుంచి వెలుగు వైపు నడిపించే అఖండ దీపం. ఆ ఆశే విధాత తన మనసులో మానవుని కోసం దాచిన అత్యంత విలువైన అంతిమ బహుమతి.విధాత తన అనంత సృష్టిని చూసి ఎప్పుడు పరమ సంతృప్తి చెందుతాడు? మానవుడు సాధించిన మానవీయ గొప్పతనాన్ని చూసినప్పుడే ఆ సృష్టికర్త కళ్లలో ఆనందం తాండవిస్తుంది. ఒక నిపుణుడైన వైద్యుడు ప్రాణాపాయంలో ఉన్న రోగిని నయం చేసినప్పుడు, ఒక నిష్కల్మష ఉపాధ్యాయుడు విద్యార్థి మనసులో జ్ఞాన జ్యోతిని వెలిగించినప్పుడు, ఒక కర్షకుడు తన చెమట చుక్కలతో పొలాన్ని పండించి లోకానికి అన్నం పెట్టినప్పుడు, ఒక తల్లి తన బిడ్డను చూసి మొదటిసారి మురిపెంగా నవ్వినప్పుడు ప్రతిసారీ ఆ విధాత ముఖంలో చిరునవ్వు చిందుతుంది. ఆ పవిత్ర క్షణాలే విధాత తలపున ప్రభవించిన మానవ మహిమకు సజీవ నిదర్శనాలు.మహాకవి కాళిదాసు తన అభిజ్ఞానశాకుంతలంలో ఒక అమూల్యమైన మాట రాశాడు "సర్వం పరవశం దుఃఖం, సర్వమాత్మవశం

ఎంత మాత్రం ఆకళింపు చేసుకున్నాం?విధాత కలల సాకార రూపమే ఈ మానవుడు నిస్వార్థంగా ప్రేమను పంచగలిగే అమృత శక్తి మరెక్కడా లేదు, కన్నీళ్ళకు ఆర్ద్రమైన అర్థమిచ్చే హృదయం మరే జీవికీ సాధ్యం కాదు.ఒక భావుకుడైన కవి అద్భుతమైన కవిత రాస్తాడు. ఆ కవితలో అక్షరాలు అందంగా పరుచుకున్నప్పుడు, ఆ అక్షరాల వెనుక కవి అంతరాత్మ కదులుతూ మనకు స్పర్శిస్తుంది. అదే విధంగా, ఈ అనంత విశ్వాన్ని సృష్టించిన ఆ జగన్నాటక సూత్రధారి తన తలపులోని మాధుర్యాన్ని, తన మనసులోని కోమలత్వాన్ని ఒకే ఒక్క రూపంలో అద్భుతంగా చెక్కాడు ఆ సజీవ శిల్పమే మానవుడు! సూర్యుడిలో ఉష్ణాన్ని, వెలుతురును ఇచ్చాడు, చంద్రుడిలో ఆహ్లాదకరమైన చల్లదనాన్ని నింపాడు, ప్రవహించే నదిలో మధురమైన సంగీతాన్ని కురిపించాడు. కానీ, ప్రేమను, సృజనాత్మక ఆలోచనను, నవ్య కళలను ఇవన్నీ కేవలం మానవుడికి మాత్రమే కానుకగా ఇచ్చాడు.తెలుగు కవిత్వ వినువీధిలో ధ్రువతార వంటి పోతనామాత్యుడు భాగవతంలో ఎంతో హృద్యంగా రాశాడు "శ్రీకరుడైన హరి తన లీలా విభూతిగ ఈ సృష్టిని నిర్మించెను." ఆ సృష్టి క్రమంలో మానవుడు కేవలం జీవచ్ఛవం లాంటి ఒక జంతువు కాడు. అతడు ఉన్నతంగా ఆలోచించగలడు, భావోద్వేగాలను అనుభవించగలడు, సరికొత్త ప్రపంచాన్ని సృజించగల డు, లలిత కళలను పండించగలడు, అన్నింటికీ మించి తోటి మానవుని కష్టాలకు కన్నీళ్ళు కార్చగలడు. ఇవన్నీ విధాత హృదయం నుండి ఉద్భవించిన దైవీక గుణాలు.ఈ విశాల సృష్టిలో ఎన్నో కోట్లాది జీవులున్నాయి. ఏనుగు భౌతిక బలంలో ఎంతో గొప్పది, డేగ చూపు తీక్షణతలో సాటిలేనిది, తాబేలు ఆయుష్షులో సుదీర్ఘమైనది. కానీ, సత్యాన్వేషణ చేసే జ్ఞానాన్ని, వివేకాన్ని, తర్కాన్ని, శాస్త్రాన్ని, సంగీతాన్ని, రసమయ కవిత్వాన్ని ఇవన్నీ కేవలం మానవుడికే లభించాయి. ఇది విధాత యొక్క ప్రత్యేక వాత్సల్యం, అమూల్యమైన కరుణ. ఈ అలౌకిక జ్ఞానమే మానవుని విధాత తలపుకు అత్యంత సమీపంగా తీసుకువెళు తుంది.నాడు ఆర్యభట్ట శూన్యాన్ని సృష్టించి సూర్యుడి దూరాన్ని లెక్కించాడు. గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ అనంతమైన సంఖ్యల రహస్యాలను ఛేదించి ప్రపంచాన్ని విస్మయపరిచాడు. సర్ సి.వి. రామన్ కాంతిలోని అద్భుత రంగుల వెనుక ఉన్న విజ్ఞానాన్ని కనుగొన్నాడు. వీళ్ళందరూ విధాత మానవుడికిచ్చిన జ్ఞాన నిధిని తమ జీవితాలలో వెలిగించిన తేజోదీపాలు. ఆ దీపాల వెలుతురు ఇప్పటికీ, ఎప్పటికీ మానవజాతిని ప్రగతి పథంలో నడిపిస్తూనే ఉంది. ఈ విధంగా, విధాత సంకల్పంతో జన్మించిన విజ్ఞానమే తరతరాల మానవ వికాసానికి మూలస్తంభం.ఒక శిల్పి నిర్జీవమైన రాతిని తీసుకొని, తన ఉలి దెబ్బలతో దానిలో దైవ రూపాన్ని, జీవాన్ని



సాంస్కృతిక వైభవంలో అతి సంపన్నమైనది. కూచిపూడి నృత్య భంగిమల్లో విధాత లయ కనిపిస్తుంది. కర్నాటక సంగీత స్వరాలలో విధాత ఓంకార నాదం వినపడుతుంది. అన్నమయ్య సంకీర్తనలలో విధాత ప్రణయ కాంతులు స్పందిస్తాయి. త్యాగరాజ కీర్తనలలో నిరుపమానమైన భక్తి ప్రవహిస్తుంది. ఈ పుణ్యనేలపై పుట్టిన ప్రతి మానవుడు ఈ గొప్ప సాంస్కృతిక వారసత్వానికి వారసుడు ఇది విధాత తలపున ప్రభవించిన దివ్య వరం.ఈ జగతిపై పుట్టిన ప్రతి మానవుడూ విధాత తన రక్తాక్షరాలతో రాసిన ఒక అద్భుత కవిత అతని జీవిత ప్రయాణమే ఒక పవిత్ర మహాకావ్యం.

విధాత తలపున ప్రభవించిన అన్ని శక్తులలోనూ అత్యంత మహత్తరమైన శక్తి ఏదైనా ఉందంటే అది కేవలం ప్రేమ మాత్రమే. ప్రేమ లేని మానవ జీవితం ఎండమావులు నిండిన ఒక ఎడారి వంటిది. అదే ప్రేమతో నిండిన జీవితం నిత్య కల్యాణ పచ్చని వసంతవనం లాంటిది. కల్మషం లేని తల్లి ప్రేమలో విధాత కరుణా రసం ప్రతిబింబిస్తుంది. నిస్వార్థమైన స్నేహంలో విధాత ఆనందం ప్రతిఫలిస్తుంది. సాటివారికి చేసే పరోపకారంలో ఆ భగవంతుడి పవిత్ర ఆదేశం వినపడుతుంది. ప్రేమయే పరమార్థం అని యుగపురుషులు, మహాత్ములు చాటిచెప్పింది ఊరికే కాదు అది విధాత సంకల్పానికి నిఖార్సయిన సారాంశం.ఈ లోకంలో ఎన్నో కష్టాలున్నాయి, కన్నీళు న్నాయి, అనుక్షణం సంఘర్షణలున్నాయి. అయినప్పటికీ మానవుడు ప్రతి ఓటమి నుంచీ ఫీనిక్స్ పక్షిలా లేచి నిలబడగలడు. ఎందుకంటే విధాత ఆ

సుఖం" అన్నీ పరాధీనమైతే దుఃఖం, అన్నీ స్వాధీనమైతేనే పరమ సుఖం. మానవుడు తన అంతర్గత జ్ఞానం, అద్భుత కళ, నిస్వార్థ ప్రేమ, వివేకం వీటన్నింటినీ స్వాధీనం చేసుకున్నప్పుడు అతడు నిజంగా విధాత తలపున ప్రభవించిన మహోన్నత జీవిగా ఇలవేల్పులా నిలుస్తాడు. అప్పుడే అతని జీవితం ఒక సంపూర్ణ కావ్యంగా మారుతుంది.ఈ నవ సమాజంలో మనలో ప్రతి ఒక్కరూ విధాత తన మనసులో భావించిన ఒక అనన్యమైన, విశిష్టమైన సృష్టి. మీ సృజనాత్మక ఆలోచనలు, మీ ఉన్నతమైన కలలు, మీ పరోపకార హృదయం, మీ సత్యసంధత, మీ నిరంతర ప్రేమస్వభావం ఇవన్నీ ఆ విధాత మీ ద్వారా ఈ లోకానికి చేరవేయాలనుకున్న దివ్య సందేశాలు. ఆ సందేశాలను మీరు మీ నిత్య జీవితంలో ఆచరించి చూపించినప్పుడు, మీరు కేవలం రక్తం, మాంసం ఉన్న ఒక సాధారణ వ్యక్తి కాదు సాక్షాత్తు ఆ విధాత యొక్క ప్రతినిధి అవుతారు.చివరగా, ఈ అపురూపమైన, అమూల్యమైన జీవితాన్ని మనం ఎలా జీవించాలి? విధాత మనకు ప్రసాదించిన ఈ మహత్తర అవకాశాన్ని వృథా చేసుకోకూడదు. మన ప్రతి అడుగూ అపారమైన నిజాయితీతో, మన ప్రతి మాటా అమృతతుల్యమైన ప్రేమతో, సహాయం కోసం చాచే ప్రతి చేయీ సేవతో నింపాలి. ఆ నిస్వార్థ సేవలో, ఆ అంతులేని ప్రేమలో, ఆ నిఖార్సయిన నిజాయితీలో విధాత మన అంతరంగంలో నవ్వుతాడు, మన ప్రతి అడుగులోనూ తోడై నడుస్తాడు, మనలోనే పరమజ్యోతియై ప్రకాశిస్తాడు.సహస్రాబ్దాల క్రితం, కాలం పుట్టకముందు ఎప్పుడో ఆ విధాత తన మనసులో మానవుని రూపాన్ని ఎంతో ప్రేమగా ఊహించుకున్నాడు. ఆ ఊహల పల్లకి నుండి పుట్టిన మానవుడు నేడు ఈ భూమి మీద సగర్వంగా నడుస్తున్నాడు. ఆ మానవుడు మరెవరో కాదు, మీరు! ఈ లోకంలో మీ ఉనికి అర్థరహితం కాదు, ప్రయోజనరహితం అంతకన్నా కాదు. మీరు విధాత తలపున ప్రభవించిన అమృతాంశులు, ఈ సృష్టికి అలంకారాలు. మీ జీవితం ఒక పవిత్ర మహాకావ్యం. ఆ కావ్యాన్ని ఆదర్శవంతంగా, సార్థకంగా జీవించండి. అప్పుడే విధాత మనసులో మీ కోసం సంకల్పించిన పరమార్థం, లక్ష్యం సంపూర్ణంగా నెరవేరుతాయి



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# ఎబోలా అరికట్టే చర్యలు బలోపేతం

## ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే వారిపై ఆంక్షలు

## వీసాలను తాత్కాలికంగా నిలిపివేసిన అమెరికా

వాషింగ్టన్: ఎబోలా వ్యాప్తిని నివారించడానికి ముందుజాగ్రత్త చర్యలను బలోపేతం చేస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. దీనిలో భాగంగా వ్యాధి వ్యాప్తి చెందిన ఆఫ్రికా ప్రాంతాల నుండి వచ్చే విమాన ప్రయాణికులను పరీక్షించడంతో పాటు, వీసాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా రాయబార కార్యాలయం వెల్లడించింది. డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డి ఆర్ సి) లో ప్రాణాంతకమైన ఎబోలా వ్యాప్తిని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు హెచ్ ఒ) అత్యవసర పరిస్థితిగా ప్రకటించిన నేపథ్యంలో, యుఎస్ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సిడిసి) ఈ నివారణ చర్యలను చేపట్టింది. విమానాశ్రయాలలో స్క్రీనింగ్‌తో పాటు, గత 21 రోజులలోపు ఉగాండా, డి ఆర్ సి, దక్షిణ సూడాన్‌లకు ప్రయాణించిన అమెరికా యేతర పాస్‌పోర్ట్ హోల్డర్లపై ప్రవేశ ఆంక్షలను అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఉగాండాలోని కంపాలాలో ఉన్న అమెరికా రాయబార కార్యాలయం అన్ని వీసా సేవలను తాత్కాలికంగా నిలిపివేసి, ప్రభావితమైన దరఖాస్తుదారులకు సమాచారం అందించింది. డి ఆర్ సి లో ఉన్న ఒక



అమెరికన్ సిబ్బందికి ఎబోలా వైరస్ సోకినట్లు డబ్ల్యుహెచ్ ఒ ప్రతినిధి సతీష్ పిళ్ళై ధృవీకరించారు. ఆ వ్యక్తికి పరీక్షల్లో పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో, చికిత్స నిమిత్తం జర్మనీకి తరలించేందుకు యత్నిస్తున్నామని అన్నారు. అలాగే అతనితో పరిచయం ఉన్న మరో ఆరుగురిని క్వారంటైన్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రజలకు తక్షణ ప్రమాదం తక్కువగానే ఉందని అంచనా వేస్తున్నామని, అయితే మారుతున్న పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తున్నట్లు సిడిసి తెలిపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ వ్యాధి వ్యాప్తిపై ఆందోళన వ్యక్తం చేస్తూనే, ప్రస్తుతానికి ఇది ఆఫ్రికాకే పరిమితమైందని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, ఈ ఎబోలా సంక్షోభంపై ట్రంప్ ప్రభుత్వం స్పందిస్తున్న తీరుపై అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ ఒ) నుండి అధికారికంగా వైదొలగడం, గతంలో ఎబోలా నివారణలో కీలక పాత్ర పోషించిన 'యుఎస్ ఎఐడి' (యుఎస్ ఎఐడి) నిధులలో కోత విధించడం ప్రస్తుత నియంత్రణ ప్రయత్నాలపై ప్రతికూల ప్రభావం చూపిందనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం తీసుకుంటున్న ప్రయాణ నిషేధాలు కేవలం నాటకమేనని, ట్రంప్ ప్రభుత్వం ఈ విషయంలో చాలా వెనుకబడి వ్యవహరిస్తోందని జార్జిటౌన్ యూనివర్సిటీ నిపుణులు మాథ్యూ కావనాగ్ విమర్శించారు. గతంలో ప్రభుత్వ ఏజెన్సీల సమన్వయం వల్ల వ్యాధిని వేగంగా అరికట్టగలిగారని, కానీ ఇప్పుడు వందలాది కేసులు నమోదై, తీవ్రంగా వ్యాపించిన తర్వాతే చర్యలు చేపట్టడం అమెరికా వ్యూహాత్మక వైఫల్యమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తాము స్థానిక ఆరోగ్య సంస్థలతో కలిసి పనిచేస్తున్నామని, తక్షణ ప్రతిస్పందన చర్యల కోసం 13 మిలియన్ డాలర్ల సహాయాన్ని సమీకరించినట్లు సిడిసి ప్రకటించింది.

# రైతులకు బేడీలు వేసిన చరిత్ర బీఆర్ఎస్ ది : బోయపల్లి రాఘవేందర్ రెడ్డి



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** అధికారంలో ఉండి రైతులను నిలువునా ముంచిన బీఆర్ఎస్ ప్రభుత్వం, నేడు కాంగ్రెస్ ప్రభుత్వంపై ధర్నాలు చేయడం, విమర్శలు గుప్పించడం అత్యంత హాస్యాస్పదమని తెలిపిన బోయపల్లి రాఘవేందర్ రెడ్డి. ప్రజా తీర్పుతో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్, కేవలం రాజకీయ ఉనికి కోసమే రైతులను వాడుకుంటూ మొసలి కన్నీరు కారుస్తోందని, వరి వేస్తే ఉరి అన్నది ఎవరని, ?గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి స్వయంగా తెలంగాణలో ఎవరూ వరి వేయొద్దు వరి వేస్తే ఉరి పెట్టుకున్నట్లే అని రైతులను భయభ్రాంతులకు గురిచేసిన విషయాన్ని రాష్ట్ర ప్రజలు ఇంకా మర్చిపోలేదని, నాడు వరి పంట వేసినందుకు రైతులను చిన్నచూపు చూసి, కొనుగోలు కేంద్రాలు సకాలంలో తెరవకుండా ఇబ్బంది పెట్టిన చరిత్ర బీఆర్ఎస్ది. అలాంటి వారు నేడు కాంగ్రెస్ ప్రభుత్వంపై ధాన్యం కొనుగోళ్లపై మాట్లాడటం ఒక విడ్డూరమని, ఖమ్మంలో రైతులకు బేడీలు వేసిన మీరు ?రైతుల సంక్షేమం గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ నాయకులకు అస్సలు లేదని, గత ప్రభుత్వ హయాంలో ఖమ్మం మార్కెట్ యార్డులో తమ పంటకు మద్దతు ధర అడిగిన రైతులకు చేతులకు బేడీలు వేసి, జైలుకు పంపిన క్రూరమైన చరిత్ర బీఆర్ఎస్ పాలనది. అన్నదాతలను నేరస్థుల్లా చూసిన నాయకులు నేడు ప్రజాస్వామ్యబద్ధంగా నడుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని 'గుడ్డి ప్రభుత్వం' అని విమర్శించడం వారి అహంకారానికి నిదర్శనం.కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉంది. ?ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోంది. అకాల వర్షాలు మరియు వాతావరణ మార్పులు ఉన్నప్పటికీ, ప్రభుత్వం పకడ్బందీగా ధాన్యం సేకరణ ప్రక్రియను చేపడుతోంది. క్షేత్రస్థాయిలో ఉన్న ఇబ్బందులను అధిగమిస్తూ, గన్నీ బ్యాగుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటోంది. గత ప్రభుత్వం అస్తవ్యస్తం చేసిన ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుతూనే, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ మరియు రైతు భరోసాను అర్హులైన ప్రతి రైతుకూ అందించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు పోతుందని, గతంలో రీ-డిజైనింగ్ పేరుతో ప్రాజెక్టుల వ్యయాన్ని పెంచి కమిషన్లు దండుకున్న చరిత్ర బీఆర్ఎస్ది. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నారాయణపేట, కోడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ వంటి ప్రాజెక్టులను పారదర్శకంగా, తక్కువ ఖర్చుతో ప్రజలకు ఉపయోగపడేలా నిర్మిస్తోంది. నాడు అధికార మదంతో రైతులపై లాఠీఛార్జీలు చేయించి, బేడీలు వేసి, వరి వేస్తే ఉరి అని హెచ్చరించిన బీఆర్ఎస్ నాయకులు నేడు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లాలని చూడటం ఆకాశం వైపు చూసి ఉమ్మివేయడమే. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతు పక్షపాత ప్రభుత్వమే, రైతుల ప్రతి గింజా కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని బోయపల్లి రాఘవేందర్ రెడ్డి తెలిపారు.

# రాత్రివేళ భవనంపై నుండి పడి వ్యక్తి మృతి



**చౌటుప్పల్,మే 19, క్రైమ్ మిర్రర్ :** రాత్రివేళ నిద్రమత్తులో ప్రమాదవశాత్తు భవనం మూడో అంతస్తు నుండి కిందపడి ఓ వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ మన్మధ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... చత్తీస్గఢ్ రాష్ట్రానికి చెందిన సీతారాం ( 24) వృత్తి రీత్యా మేస్త్రి పని కోసం ఐదు నెలల క్రితం చౌటుప్పల్ కు వచ్చి బంగారి గడ్డలో నివాసం ఉంటున్నారు.తంగడపల్లి రోడ్డులోని సత్యనారాయణ వెంచర్ లో జరుగుతున్న ఒక ఇంటి నిర్మాణంలో మేస్త్రి పని నిమిత్తం ఇతనికి వరుసకు అన్న అయినా రాజు యాదవ్ వద్దకు వెళ్ళాడు. ఆ తర్వాత సీతారాం కూడా అతని కోసం అట్టి ఇంటికి 18 వ తేదీ సోమవారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో వెళ్ళాడు. వారు కాసేపు మాట్లాడుకుని అట్టి ఇంటి మూడవ అంతస్తుపై రాత్రి 10 గంటల సమయంలో పడుకున్నారు. ఆ తర్వాత రాజు యాదవ్ 19 వ తేది మంగళవారం తెల్లవారుజామున 5 గంటలకు లేచి చూడగా అతని పక్కన అతని తమ్ముడు కనబడకపోవడంతో చుట్టూ చూడగా అతని తమ్ముడు గ్రౌండ్ ఫ్లోర్ నందు లిఫ్ట్ కొరకు తీయబడిన గుంతలో పడి ఉన్నాడు. అతడు వెంటనే చుట్టుపక్కల వారి సహాయంతో ప్రైవేట్ వాహనంలో చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి డ్యూటీ డాక్టర్ పరీక్షించి అప్పటికే అతను మరణించినట్లు తెలిపినారు. అతడు అర్ధరాత్రి సమయంలో టాయిలెట్ కు లేచి నిద్ర మత్తులో ప్రమాదవశాత్తు మూడవ అంతస్తు నుండి కాలుజారి కింద పడి తలకు బలమైన రక్తగాయమై చనిపోయినట్లు వారు భావిస్తున్నారు. మృతుడి అన్న రాజు యాదవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు సిఐ తెలిపారు.

# నాట్య మయూరి అవార్డులు అందుకున్న చిన్నారులు

## రవీంద్రభారతిలో కూచిపూడి నృత్య ప్రదర్శనలు




**రామకృష్ణాపూర్, మే 19 (క్రైమ్ మిర్రర్):** గద్దెరాగడి శ్రీ విద్య కూచిపూడి నాట్యాలయం శిష్య బృందం హైదరాబాద్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో ప్రతిభ కనబరిచి "నాట్య మయూరి" అవార్డులను అందుకుంది. ఈ నెల 17న హైదరాబాద్లోని రవీంద్రభారతి లో గురువు కే. రమాదేవి ఆధ్వర్యంలో చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో నృత్య మాల నాట్య కళ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు విద్యార్థుల ప్రతిభను అభినందించి గురువు రమాదేవిని సత్కరించారు.ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ కూచిపూడి వంటి సాంప్రదాయ నృత్యాలను అభ్యసించడం వల్ల విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి, శారీరక దృఢత్వం పెరుగుతాయని తెలిపారు. చదువుతో పాటు ఇతర రంగాల్లోనూ రాణించేందుకు నృత్య విద్య దోహదపడుతుందని పేర్కొన్నారు.



# మార్కెట్లో పరిశుభ్రత పాటించాలి

**రామకృష్ణాపూర్, మే 19(క్రైమ్ మిర్రర్) :** క్యాతన్పల్లి మున్సిపాలిటీ పరిధిలోని బీ జోన్ రాజీవ్ చౌక్ కూరగాయల మార్కెట్ను మున్సిపల్ చైర్పర్సన్ డాక్టర్ గోడిసెల సంధ్యారాణి మంగళవారం సందర్శించారు. మార్కెట్లో పారిశుద్ధ్య పరిస్థితులు, వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. మార్కెట్ ప్రాంతంలో పాడైపోయిన కూరగాయలు, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా నిర్దేశిత ప్రదేశాల్లోనే వేయాలని వ్యాపారులకు సూచించారు. మార్కెట్ పరిసరాల్లో పరిశుభ్రత పాటించకపోతే దుర్వాసన వ్యాపించడంతో పాటు ఈగలు, దోమలు పెరిగి ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు.మార్కెట్ ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరచాలని మున్సిపల్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు, వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా మార్కెట్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి గేట్ నిర్మాణం చేపట్టే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రామిడి కుమార్, లక్ష్మీకాంత్, మణి, సానిటరీ ఇన్స్పెక్టర్ సునీల్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ సంతోష్, మార్కెట్ వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## విద్యానగర్లో స్థానికుల సమస్యలు తెలుసుకున్న చైర్పర్సన్ సంధ్యారాణి




**రామకృష్ణాపూర్, మే 19 (క్రైమ్ మిర్రర్) :** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు విద్యానగర్లో డ్రైనేజీ సమస్యలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమాచారం అందడంతో మున్సిపల్ చైర్పర్సన్ సంధ్యారాణి అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.స్థానిక ప్రజలను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో పలుచోట్ల లీకేజీలు ఏర్పడి దుర్వాసన వ్యాపిస్తోందని గమనించిన చైర్పర్సన్ సంధ్యారాణి, సమస్యను తాత్కాలికంగా కాకుండా శాశ్వతంగా పరిష్కరించేలా వెంటనే మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.డ్రైనేజీ లీకేజీల వల్ల ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని పేర్కొంటూ పారిశుద్ధ్య పనులను మరింత మెరుగుపరచాలని సూచించారు.త్వరలో మరికొంత మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు విధుల్లోకి రానున్నారని, వారు చేరిన అనంతరం ప్రతి వార్డులో రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాల పరిస్థితిని పరిశీలించి అవసరమైన మరమ్మతులు మున్సిపాలిటీ ద్వారా చేపడతామని తెలిపారు.అదే సమయంలో ప్రజలు కూడా తమ పరిసర ప్రాంతాల్లో చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా సహకరించాలని కోరారు. స్థానికుల సూచనల మేరకు త్వరలో మరిన్ని చెత్త డబ్బాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రామిడి కుమార్, యూత్ నాయకులు లక్ష్మీకాంత్, మణి, నవీన్, మున్సిపాలిటీ సానిటరీ ఇన్స్పెక్టర్ సునీల్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ సంతోష్, వార్డు ప్రజలు సౌజన్య, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.


# అందోజు శ్రీనివాసుకు జేఎన్టీయూ పీహెచ్డీ ప్రదానం



**సంస్థాన్ నారాయణపురం, మే 19(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని జనగామ గ్రామానికి చెందిన అందోజు రాములు కుమారుడు అందోజు శ్రీనివాసు జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూ) అనంతపురం నుండి పీహెచ్డీ పట్టా పొందారు. ప్రొఫెసర్ సునీత యాదవ్ పర్యవేక్షణలో ఆయన ఆంగ్ల నవలలు-చలనచిత్రాలపై చేసిన సామాజిక పరిశోధనకు గాను ఈ డాక్టరేట్ లభించింది. మౌఖిక పరీక్షలో ప్రొఫెసర్ వై. ఎస్. శారద బాహ్య పరీక్షాధికారిగా వ్యవహరించగా, శ్రీనివాసు ప్రతిభను నిపుణులు అభినందించారు.సాహిత్యాన్ని, సినిమాను అనుసంధానిస్తూ స్థానిక చరిత్రలు, సాంస్కృతిక విలువలతో కూడిన చిత్రాలు రావాలని శ్రీనివాసు ఈ పరిశోధన ద్వారా స్పష్టం చేశారు. పీహెచ్డీ సాధించిన ఆయనను సీబీఐటీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.వి. నరసింహులు ప్రత్యేకంగా అభినందించారు.


## క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్సైట్కు కంటెంట్ రైటర్లు కావలెను

**సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం**



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

**9393929595**


# సీఎం సహాయ నిధి పేదలకు వరం

## రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్గౌడ్




**గండిపేట(క్రైం మిర్రర్):** సీఎం సహాయ నిధి పేదలకు వరంగా మారిందని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్గౌడ్ అన్నారు. శంషాబాద్ మండల పార్టీ సీనియర్ నాయకులు కె.చంద్రారరెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి దాదాపు రూ.3 లక్షల చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్గౌడ్ హాజరై లబ్ధిదారులకు చెక్కులను పంపిణి చేశారు. కవ్వగూడకు చెందిన కాటి ఆదిత్యాకు రూ.47 వేలు, పాలమాకులకు చెందిన సమ్రీన్ బేగంకు రూ.34 వేలు, పెద్దషాపూర్కు చెందిన వడ్డెమోని రాజుకు రూ.19,500, అల్లికోల్ తాండకు చెందిన జాటావత్ సంగీతకు రూ.31 వేలు, సుల్తాన్పల్లికి చెందిన ఎలకిచర్ల రఘుపతిరెడ్డికి రూ.60 వేలు, హామీదుల్లనగర్కు చెందిన వట్టెల గణేష్యాదవ్కు రూ.60 వేలు, పిల్లోనిగూడకు చెందిన కిష్టమొల్ల సిద్దయ్యకు రూ.32 వేలు, కాచారంకు చెందిన చాకలి మంజులకు రూ.15 వేలు, తశల సునీతకు రూ.18 వేల చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అనేది ఒక వరం లాంటిది దీనిని ప్రతి ఒక్కరు వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి చిలుకమర్రి మహేందర్ముదిరాజ్, సర్పంచ్లు ప్రభాకర్గౌడ్, బాలుముదిరాజ్, పి.నర్సింహ్మా, నార్సింగి మార్కెట్ డైరెక్టర్ శ్రీకాంత్గౌడ్, ఉపసర్పంచ్లు దండు శివ, పి.శ్రీశైలం, మాజీ సర్పంచ్లు దండు ఇస్తారి, సతీష్యాదవ్, కర్రె నర్సింహ్మా, భిక్షపతి, జగన్గౌడ్, వార్డు సభ్యులు మహేష్, రాజుగౌడ్, సిద్ధిక్, శివ, జర్కి రమేష్, వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
6 బుధవారం 20-5-2026

# ఉత్పత్తి లక్ష్యాలే ధ్యేయం

## మందమర్రి ఏరియాలో మల్టీ డిపార్ట్‌మెంటల్ సమీక్షలు..కాసిపేట-02 గని కార్మికులకు అధికారుల దిశానిర్దేశం





**మందమర్రి, మే 19 (క్రైమ్ మిర్రర్):** సింగరేణి సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాల సాధనకు ఉద్యోగులంతా సమష్టిగా కృషి చేయాలని అధికారులు పిలుపునిచ్చారు. సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డా. బుద్ధ ప్రకాష్ జ్యోతి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న మల్టీ డిపార్ట్‌మెంటల్ సమీక్ష సమావేశాల్లో భాగంగా మంగళవారం మందమర్రి ఏరియాలోని కాసిపేట-02 గనిలో మూడు షిఫ్టుల ఉద్యోగులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు.ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ మార్గదర్శకత్వంలో జరిగిన ఈ సమావేశాల్లో వివిధ విభాగాల అధికారులు పాల్గొని ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుపై ఉద్యోగులకు దిశానిర్దేశం చేశారు. భూగర్భ గనుల నుంచి వెలికితీసే బొగ్గు నాణ్యతను మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బొగ్గుతో పాటు రాయి, మట్టి కలవకుండా 'ఫేస్ కటింగ్' దశలోనే జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.గనుల్లో అత్యాధునిక యంత్రాల సమర్థ వినియోగంతో ఉత్పాదకతను పెంచాల్సిన అవసరాన్ని అధికారులు వివరించారు. సంస్థ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఆర్థిక ప్రయోజనాలపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేందుకు క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు.యాజమాన్యం సూచనలను పాటిస్తూ సురక్షిత విధానాలతో పనిచేస్తే ఉత్పత్తి మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్‌వో టు జీఎం జీఎల్ ప్రసాద్, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ బాలాజీ భగవతి, ఏజీఎం (ఎఫ్అండ్ఏ) ప్రసాద్, డీజీఎం (పర్సనల్) అశోక్, డీజీఎం (ఐఈడీ) కిరణ్‌కుమార్, ఐటీ డిప్యూటీ మేనేజర్ రవి, క్వాలిటీ ఇన్‌చార్జ్ ప్రదీప్, గని మేనేజర్ లక్ష్మీనారాయణ, సంక్షేమ అధికారి భార్గవ్, ఈఈ శ్యామ్,ఉద్యోగులు పాల్గొన్నారు.



## రవీంద్రభారతిలో ప్రతిభా పురస్కారం అందుకున్న సంస్థాన్ నారాయణపురం విద్యార్థిని గుండమల్ల అక్షిత

**సంస్థాన్ నారాయణపురం, మే 19(క్రైమ్ మిర్రర్):** హైదరాబాద్ రవీంద్రభారతి లో ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు "ప్రతిభా పురస్కారం - 2026" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన ప్రధానోపాధ్యాయులను కూడా ఈ సందర్భంగా గౌరవ సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో సంస్థాన్ నారాయణపురం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని గుండమల్ల అక్షిత పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 569 మార్కులు సాధించి నారాయణపురం మండల టాపర్‌గా నిలిచింది. ఆమె ప్రతిభను గుర్తిస్తూ ఐ ఫౌండేషన్ ప్రతినిధులు ప్రతిభా పురస్కారం అందజేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి



**సంస్థాన్ నారాయణపురం,మే 19(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో మెంగవారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి హాజరై కళ్యాణ మహోత్సవంలో పాల్గొని అమ్మవారి దీవెనలు పొందారు. అనంతరం మెంగ వారి కుటుంబ సభ్యులు సర్పంచ్ ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డి ఈ మెంగ లక్ష్మయ్య,మెంగ సత్తిపండు,మెంగ సైదులు,మెంగ గోపాల్, గంగనబోయిన యాదయ్య, మెంగ బాలకృష్ణ, కారోబార్ పున్నం యాదగిరి, క్రైమ్ మిర్రర్ రిపోర్టర్ ఉప్పల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు

### శంషాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి.ప్రమోద్‌కుమార్



గండిపేట(క్రైం మిర్రర్): ట్రాఫిక్ నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని శంషాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి.ప్రమోద్‌కుమార్ తెలిపారు. మొత్తం 15 కేసులు పరిష్కరించబడ్డాయని తెలిపారు. ఫలితంగా మొత్తం జరిమానా 32 వేలు వసూలు చేశామన్నారు. మద్యం సేవించి వాహనం నడిపిన ఒకరిని న్యాయమూర్తి కె.వేణుగోపాల్‌రెడ్డి రాజేంద్రనగర్ 10 స్పెషల్ కోర్టు ముందు హాజరు పరచగా వారికి జైలు శిక్ష, జరిమానా విధించడం జరిగిందన్నారు. డి.సుదర్శన్‌కు ఒక రోజు సాధారణ కారాగార శిక్ష, రెండు వేల జరిమానా, పది మంది డ్రంక్ అండ్ డ్రైవింగ్‌లో పట్టుబడిన వారి నుంచి మొత్తం 24 వేల రూపాయల జరిమానా విధించడం జరిగిందన్నారు. మరో నాలుగు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నమోదైన కేసుల్లో జరిమానా ఆరు వేల జరిమానా విధించడం జరిగిందన్నారు. ఆర్‌జీఐఏ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ రహదారి భద్రతను నిర్ధారించడానికి, ట్రాఫిక్ నియమాలను కఠినంగా అమలు చేయడానికి కట్టుబడి ఉందన్నారు. ప్రజలందరూ జరిమానాలను నివారించడానికి, వారి భద్రతను నిర్ధారించడానికి ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు.

## ఆలయ పూజారిగా కొండోజు నవీన్ ను కొనసాగించుటకు గ్రామస్తుల తీర్మానం

### మునుగోడు శివాలయంలో గ్రామ పెద్దల సమావేశం



**మునుగోడు మే 19 :** నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రంలోని శ్రీ శివరామాలయంలో పూజారిగా కొనసాగుతున్న కొండోజూ నవీన్ కుమార్ పై వస్తున్న ఆరోపణలపై మంగళవారం రోజు ఆలయము లో గ్రామ పెద్దల సమక్షంలో చర్చించడం జరిగింది..2004 సంవత్సరం నుండి ఆలయంలో పూజారిగా కొనసాగుతూ నేటి వరకు ఉత్సవాలు నిర్వహిస్తూ ఆలయ అభివృద్ధికి పాటుపడటం జరిగిందని అన్నారు..కొంతమంది పురిహితులపై తప్పుడు సృష్టించి వారిపై వస్తున్న ప్రచారాలు అవాస్తవం అని,,ప్రతి నెలలో జరిగే ఉత్సవాలు అతని శిష్య బృందం చే నిర్వహించడం జరుగుతుంది.. దినదినాభివృద్ధికి పాటుపడు తున్న పూజారులపై తప్పుడు ప్రచారాలు చేసుకోవడం మానుకోవాలని గ్రామ ప్రజలు ఇతబు పలికారు..కొండోజు నవీన్ కుమార్ నీ ఆలయంలో యధావిధిగా నిత్య పూజలు దూపదీప కార్యక్రమాలు కొనసాగించుటకు గ్రామస్తులు తీర్మానించనైనది, ఇట్టి తీర్మానాన్ని గ్రామ సర్పంచి గారికి అందజేశామని గ్రామ పెద్దలు తెలిపారు..ఈ సమావేశంలో కర్నాటి మల్లయ్య, పాల్వాయి యాదగిరి రెడ్డి, పాల్వాయి రామ్ రెడ్డి, పాల్వాయి చెన్నారెడ్డి, బొడ్డు యాదయ్య,సింగం కృష్ణయ్య,యాసరాని యాదయ్య,, యడవల్లి సురేష్ కుమార్,సాగర్ల లింగస్వామి,మిరియాల కృష్ణమూర్తి, పందుల రాజేష్, బొంత లింగస్వామి, శ్రీరామోజు శ్రీనివాస్,మిరియాల రమాశంకర్,దాము నరసింహ,గార్లపాటి శ్రీనివాస్, అయితగోని నరసింహ,కట్కూరి శంకర్,కట్కూరి లింగస్వామి,మల్లేష్, రాంబాబు,సింగం సురేష్ కుమార్, గ్రామస్థులు, మహిళలు,యువత, అర్చకులు, పాల్గొన్నారు.

## జటావత్ తండాలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ

### శివాజీ ధైర్యం, దేశభక్తి యువతకు స్ఫూర్తి : ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, మే 19:** మిర్యాలగూడ మండలం జటావత్ తండాలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని మంగళవారం మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శివాజీ మహారాజ్ ఒక వ్యక్తి మాత్రమే కాకుండా అజేయమైన శక్తి, ధైర్యానికి ప్రతీక అని కొనియాడారు.పరాయి పాలనను ఎదిరించి హిందూ స్వరాజ్య స్థాపనకు కృషి చేసిన మహనీయుడు శివాజీ మహారాజ్ అని పేర్కొన్నారు. శత్రువుల స్త్రీలను సైతం తల్లితో సమానంగా గౌరవించిన గొప్ప సంస్కారం ఆయన సొంతమని అన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయని దృఢ సంకల్పం, ప్రజల సంక్షేమాన్ని కోరుకునే పరిపాలనా దక్షత శివాజీ మహారాజ్ ప్రత్యేకతలని వివరించారు.శివాజీ మహారాజ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన యువత, కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలను ప్రత్యేకంగా అభినందించారు. శివాజీ మహారాజ్ చూపిన ధైర్యసాహసాలు, దేశభక్తి ప్రతి ఒక్కరికీ ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మెడిసుర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

### ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మూడు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకొవాలి

### మెడిస్యూర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ధనుంజయ



**కూకట్ పల్లి, మే 19 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధి పటేల్ కుంట పార్కు దగ్గర మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ధనుంజయ సహకారంతో మెడిస్యూర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, హైటు, వెయిట్ తదితర వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ధనుంజయ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మూడు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. వైద్యుల సూచనల మేరకు తగిన మందులు వాడాలనీ పోషక విలువలున్న ఆహారం తీసుకొని, ప్రతి రోజు తప్పనిసరిగా వ్యాయామం చేయాలని సూచించారు. మార్కెటింగ్ హెడ్ సందీప్ మాట్లాడుతూ ఇలా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, తమ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి సరైన సమయంలో వైద్య పరీక్షలు చేయించుకొని డాక్టర్ సలహా మేరకు సరైన మందులు వాడితే ఆరోగ్యకరమైన జీవితాన్ని ఆనందంగా గడపవచ్చని ఆయన తెలిపారు. డాక్టర్ సింధూజ సిబ్బంది వైద్య పరీక్షలు చేశారు.

## నూతన ఎస్ఐ ని సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు



**క్రైమ్ మిర్రర్, నేరేడుచర్ల :** నేరేడుచర్ల మండల నూతన ఎస్సై సైదిరెడ్డిని హుజూర్ నగర్ నియోజక వర్గ బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో నూతన ఎస్సై సైదిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల ప్రజలకు మంచి సేవలు అందించేలా, శాంతి భద్రతల విషయంలో తనదైన మార్క్ చూపిస్తూ , మధ్యకద్రవ్యాలు , బెట్టింగ్లు,దూరంగా ఉంచేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తూ , ముఖ్యంగా గ్రామాల్లో యువతకి వారధిగా,ప్రజల సంరక్షణకి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో హుజూర్ నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి పసుపులేటి నరసింహారావు,హుజూర్ నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇన్చార్జి లంకెపల్లి నాగార్జున, మండల బీఆర్ఎస్ సోషల్ మీడియా సభ్యులు కొత్త నాగయ్య ఉన్నారు.

# జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆకస్మిక తనిఖీ

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.స్వర్ణకుమారి





**గండిపేట(క్రైం మిర్రర్):** మైలార్‌దేవ్‌పల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.స్వర్ణకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పని చేస్తున్న సిబ్బంది వివరాలను, సిబ్బంది హాజరు పట్టికను, హాస్పిటల్‌లోని బెడ్లను, మెడిసన్ ఎకై ?స్పరీ డేట్‌లను హాస్పిటల్ ఆవరణను పరిశీలించారు. గర్భిణీలకు సరైన వైద్య సేవలు అందుతున్నాయా అని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రిలో డెలివరీల సంఖ్య పెరిగేలా చూడాలని ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళా క్లీనిక్ ఏర్పాటు చేయాలని అలాగే మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలన్నారు. రక్తహీనత ఉన్న వారికి సరైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణయమైన సేవలు అందించాలని, ప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాల మేరకు అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలు చేరుకోవాలని, వైద్యులు, సిబ్బంది ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల సేవా భావంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ స్ పార్టీ ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేస్తుంది ఎవరి బెదిరింపులకు బయపడదు

### రాళ్లగూడా రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

### బిఅరెస్ నాయకుల డిమాండ్



**గండిపేట(క్రైం మిర్రర్):** బీ ఆర్ స్ పార్టీ ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేస్తుంది ఎవరి బెదిరింపులకు బయపడదు అని అన్నారు. బిఆర్ స్ పార్టీ జిల్లా కార్యాలయంలో 118 నియోజకవర్గ అధ్యక్షుడు కొలను ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించరు. రాళ్లగూడా రోడ్డు నిర్మాణ పనుల జాప్యంపై మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అధికారులను వెంటనే స్పందించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించిన నేపథ్యంలో కొందరు కాంగ్రెస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను బిఆర్ స్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కొలను ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలపై ప్రశ్నించడం ప్రజా ప్రతినిధుల బాధ్యత, అధికారులను ప్రశ్నిస్తే అధికార పక్ష నాయకులకు ఎందుకు మింగుడు పడడం లేదు అన్నారు. ప్రజల కోసం మాట్లాడే నాయకులను టార్గెట్ చేయడం సరికాదు అని అన్నారు. అలాగే అధికారులపై అధికార పార్టీ ఒత్తిళ్లు తేవడం దురదృష్టకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. 119 నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చిన్నగండు రాజేందర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీలకు అతీతంగా పని చేయాలన్నారు. ప్రజల ఇబ్బందులను రాజకీయ లాభనష్టాలకు ఉపయోగించుకోవడం మానుకోవాలి అని హితవు పలికారు. 118, 119 నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాచమల్ల జయసింహ మాట్లాడుతూ బిఅరెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూనే ఉంటుందన్నారు. ఎవరి బెదిరింపులకు భయపడదు అధికార పక్షం చేసే ప్రతి తప్పిదాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతాం అన్నారు. వచ్చే ఎన్నికల్లో బిఆర్ స్ అభ్యర్థి కార్తిక్ రెడ్డి విజయం సాధించడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఅరెస్ శంషాబాద్ సీనియర్ నాయకులు చిలకమర్రి పరందాములు, రాచమల్ల రమేష్, గుంటి చరణ్, హనుమంతు ముదిరాజ్, పరమేష్ తదితరులతో పాటు యువ నాయకులు రాచమల్ల కార్తిక్, బక్క శ్రీకాంత్, వేణు గౌడ్ పాల్గొన్నారు.

# కూకట్‌పల్లి ఎంకెఎన్‌ఆర్ గార్డెన్‌లో ఈనెల 25న బీఆర్‌ఎస్ భారీ కార్యకర్తల సమావేశం

### ముఖ్య అతిథిగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

### ఫతేనగర్ డివిజన్ నుంచి భారీగా తరలిరావాలని మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్



**కూకట్‌పల్లి, మే 19 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లిలో బీఆర్‌ఎస్ పార్టీ శక్తి ప్రదర్శనకు వేదిక సిద్ధమవుతోంది. ఈనెల 25వ తేదీన కూకట్‌పల్లిలోని ఎంకె ఎన్‌ఆర్ గార్డెన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ముఖ్య అతిథిగా కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈసమావేశంలో 2026 అంశంతో పాటు రాష్ట్ర రాజకీయ పరిణామాలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలు, క్షేత్రస్థాయి బలోపేతం వంటి కీలక అంశాలపై విస్తృత చర్చ జరగనుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ సమావేశాన్ని విజయవంతం చేయడానికి ఫతేనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అధ్యక్షతన డివిజన్ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా హాజరవుతున్న ఈ కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకమైందని పేర్కొన్నారు. ఫతేనగర్ డివిజన్ నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యకర్తలే పార్టీకి అసలైన బలం అని, పార్టీ ఆదేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేది కార్యకర్తలేనని ఆయన స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించిన పండాల సతీష్ గౌడ్, ఈనెల 25న జరిగే సమావేశానికి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాజరై కేటీఆర్ సందేశాన్ని వినాలని కోరారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, యువజన విభాగం ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌పై నార్సింగి సర్కిల్ అధికారులు వివక్ష పూరిత, పక్షపా, నియంతృత్వ ధోరణి అవలంభిస్తున్నారు

### మణికొండ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ

**గండిపేట(క్రైం మిర్రర్):** నార్సింగి సర్కిల్ అధికారుల వివక్ష పూర్తి, పక్షపాత, నియంతృత్వ ధోరణిని ప్రజలు గమనిస్తున్నారని మణికొండ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ ఆగ్రహం వ్యక్తం చేశారు. మణికొండ, నెక్నాంపూర్ డివిజన్‌లలో నిర్వహించిన వాక్ ఫర్ వాటర్ కార్యక్రమానికి సంబంధించిన ఫ్లెక్సీల ఏర్పాటు కోసం బీఆర్‌ఎస్ పార్టీ తరపున సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నార్సింగి సర్కిల్--45 డిప్యూటీ కమిషనర్‌కి లిఖితపూర్వకంగా అనుమతి కొరామన్నారు. కార్యక్రమం గత ఆదివారం ముగిసినప్పటికీ ఇప్పటి వరకు అనుమతి ఇవ్వలేదు, తిరస్కరించలేదు అన్నారు. అనుమతి ఇచ్చి ఉంటే తాము విధివిధానాల ప్రకారం ఫీజులు చెల్లించేవారన్నారు. అయితే ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా నార్సింగి సర్కిల్--45 సిబ్బంది ఆకస్మాత్తుగా ఫ్లెక్సీలను తొలగించడం తీవ్రంగా ఖండించదగిన విషయమన్నారు. ఇదే విధమైన ఫ్లెక్సీలు ఇతర రాజకీయ పార్టీలకు సంబంధించినవి అనేక ప్రాంతాలలో కొనసాగుతున్నప్పటికి వాటిపై చర్యలు లేకపోవడం స్పష్టమైన వివక్షను సూచిస్తుందన్నారు. ఇటీవల జరిగిన సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ఎటువంటి రాజకీయ వివక్ష ఉండదు అని చెప్పినప్పటికి నేటి చర్య పూర్తిగా బీఆర్‌ఎస్ పార్టీపై ఉద్దేశపూర్వక పక్షపాత ధోరణిగా కనపిస్తుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల కోసం పని చేయాలి కానీ రాజకీయ పార్టీలకు అనుకూలంగా కాదన్నారు. నార్సింగి సర్కిల్ పరిధిలో అనేక ప్రాంతాలలో బ్యానర్లు, ఫ్లెక్సీలు ఉన్నప్పటికీ ప్రత్యేకంగా మణికొండ, నెక్నాంపూర్ డివజన్‌లలో మాత్రమే తొలగింపు చర్యలు చేపట్టడం పర్జలు గమనిస్తున్నారన్నారు. ఈ వివక్షపూరిత, పక్షపాత, నియంతృత్వ ధోరణిని ప్రజలు గుర్తించుకోవాలన్నారు. ఈరోజు మేము అధికారంలో లేకపోవచ్చు కానీ ప్రజాస్వామ్యంలో అవకాశాలు మారుతూ ఉంటాయన్నారు. ఈ వ్యవహారంలో బాధ్యత వహించిన ప్రతి ఒక్రరి పేర్లను తాము నమోదు చేసుకుంటున్నామన్నారు.

# ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా ప్రభాకర్ యాదవ్ నియామకం

### శుభాకాంక్షలు తెలియచేసిన బీజేవైఎం రాష్ట్ర నాయకులు అక్కినపల్లి సాయికుమార్




**కూకట్ పల్లి, మే 19 (క్రైమ్ మిర్రర్) :** భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ప్రభాకర్ యాదవ్ ని ఆయన నివాసంలో బీజేపీ రాష్ట్ర నాయకులు లంగటి నరేందర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అర్బన్ కార్యదర్శి కల్యాణిదుర్గాప్రసాద్, సీనియర్ నాయకులు శ్రీహరి యాదవ్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు అక్కినపల్లి సాయికుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం తీసుకరావడమే తమ లక్ష్యమని తెలియచేస్తూ, బీసీ ల ఐక్యత కోసం పోరాడుతూ, రాష్ట్రంలో బీజేపీ అధిష్టానం చెప్పినట్టు బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే బీసీ వ్యక్తి ముఖ్యమంత్రి అయ్యేందుకు కృషి చేస్తామని తెలియచేశారు.అలాగే తనకు శుభాకాంక్షలు తెలియచేసినందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

# భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



**కూకట్ పల్లి, మే 19 (క్రైమ్ మిర్రర్) ::** శేర్లింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని తులసి నగర్ 2 కాలనీ లోని నూతనంగా నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులను డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ సహకారంతో డివిజన్ లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, పోశెట్టిగౌడ్, నాగేష్ గౌడ్, అభిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# సుందరయ్య ఆచరణలో పని చెయ్యడమే సుందరయ్య కీ నిజమైన నివాళి

### సీపీఎం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్




**బాలానగర్, మే 19 (క్రైమ్ మిర్రర్) :** పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను ముందు తీసుకెళ్దాం అని సిపిఎం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా సిపిఎం బాలానగర్, కూకట్ పల్లి మండలం ఆధ్వర్యంలో శ్రీ శ్రీనగర్ ఆఫీసులో సుందరయ్య వర్ధంతి సభ నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమం లో సీపీఎం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్, కూకట్ పల్లి మండల కార్యదర్శి ఎం.శంకర్ పాల్గొని మాట్లాడుతూ హైదర్ అలీ ఖాన్ సుందరయ్య ని గుర్తించి పార్టీలోకి తీసుకొచ్చారని ఆ తర్వాత అమిర్ హైదర్ అలీ ఖాన్ జైలుకెళ్లాక సుందరయ్య దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్వహించడంలో కీలకపాత్ర వహించారని తెలిపారు. గొప్ప పార్లమెంటేరియన్ గా శాసనసభ పక్ష నేతగా పనిచేశారని పార్లమెంట్కు అంగు,ఆర్భాటాలు లేకుండా సైకిల్ పైనే వెళ్లారని పార్లమెంట్లు అనేక విశ్లేషణలు చేశారని, ఇప్పుడు ఉన్నటువంటి పాలకులు అంగుళాల పాటలతో రాజకీయాలు చేస్తున్నారని, కానీ సుందరయ్య నిరాహారతో నా జీవితాంతం ప్రజల కోసం సేవ చేశారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై సామాన్యులపై రోజురోజుకు అనేక భారాలు మోపుతుందని పెట్రోల్,డీజిల్, గ్యాస్ ధరలు ఆకాశాలుంటాయని కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోర్లను తీసుకొచ్చి కార్మికులకు అనేక నష్టాలకు గురి చేస్తున్నారని అన్నారు. కులాలను మతాలను ఉపయోగించి ప్రజల్ని చీల్చి ఎన్నికల్లో లబ్ది పొందుతున్నారని తెలిపారు కావున ఈ విధానాలపై రాబోవు కాలంలో ప్రజలందరిని కలుపుకొని ఐక్య పోరాటాలు చేయాల్సి వస్తుందని ఇదే సుందరయ్య కి నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు పి.సత్తయ్య, భీమేశ్వరరావు, ఏ.విజయ, కే కృష్ణ నాయక్, శ్రీను, రాములు బోరెల్లి, సాయి రెడ్డి, జోగారావు, కమల్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌కు కార్యకర్తలే బలం... 25న జరిగే విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలి

### కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



**కూకట్ పల్లి, మే 19 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ శక్తిని మరోసారి చాటిచెప్పేలా ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్న కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం కూకట్ పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కెపిహెచ్‌బి, బాలాజీనగర్ ప్రాంతాల ముఖ్య నాయకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 25న ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్‌లో నిర్వహించనున్న భారీ కార్యకర్తల సమావేశానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. అలాగే ఎమ్మెల్సీలు కె నవీన్ కుమార్, శంభీపూర్ రాజు ప్రత్యేక అతిథులుగా పాల్గొంటారని వెల్లడించారు.“సర్ పేరుతో ఓట్ల తొలగింపు జరుగుతోంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా ఒకే ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల ఓట్లను కూడా తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కుపై అప్రమత్తంగా ఉండాలి” అని సూచించారు. “కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి” రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తవుతున్నా, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు తప్ప కొత్తగా ప్రజలకు ఉపయోగపడే పనులు కనిపించడం లేదని ఆయన విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో తెలంగాణలో సంక్షేమం, అభివృద్ధి రెండు సమాంతరంగా జరిగాయని పేర్కొన్నారు. కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు చేరేలా కేసీఆర్ పాలన సాగిందన్నారు. దేశానికి ఆదర్శంగా నిలిచే అనేక పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిందని గుర్తుచేశారు.“

**ప్రచారం ఎక్కువ... అభివృద్ధి శూన్యం”**

ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం హోర్డింగులు, ప్రకటనలకే పరిమితమైందని, ప్రజలకు కనబడే అభివృద్ధి మాత్రం లేదని మండిపడ్డారు. ఇప్పటికే నిర్మించిన పార్కుల్లో మొక్కలకు నీళ్లు పోయే పరిస్థితి కూడా లేదని విమర్శించారు. హైదర్‌నగర్ నుంచి స్కైవే నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును కూడా నిలిపివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రారంభించిన డ్రైనేజ్ పనులకు కూడా నిధులు విడుదల చేయడం లేదని అన్నారు.

**కక్ష రాజకీయాలే తప్ప అభివృద్ధి లేదు**

ప్రస్తుతం రాష్ట్రంలో అభివృద్ధి రాజకీయాలకన్నా కక్షపూరిత రాజకీయాలకే ప్రాధాన్యత పెరిగిందని ఎమ్మెల్యే ఆరోపించారు. వ్యాపారాలు దెబ్బతిని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రోటోకాల్ వ్యవహారాల్లో కూడా సంబంధం లేని వ్యక్తులను చేర్చి రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడు తున్నారని విమర్శించారు. చివరగాచివరగా ఈ నెల 25న కే.టి. రామారావు అధ్యక్షతన జరిగే బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి పార్టీ శ్రేణులు, అభిమానులు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ సతీష్ అరోరా, పి. శ్యామలరాజు, బండి, మధుసూదన్ రెడ్డి, యర్రా నాగేశ్వరరావు, బసల శ్రీనివాసరావు, సాయి చౌదరి, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరాజు, జగన్, ధారాసింగ్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# మరణించిన వ్యక్తి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**క్రైమ్ మిర్రర్ వలిగొండ:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని అరూర్ గ్రామంలో ఐలపాక నర్సమ్మ అనారోగ్యంతో మరణించగా ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి వారి కుమారుడు ని ఐలపాక స్వామి ని పరామర్శించి 5,000/ వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బుర్ర నరసింహ,దామెర అంజయ్య,బుర్ర శ్రీశైలం,వేముల అనిల్ కుమార్,భోగరం ధర్మయ్య,పోలేపాక నర్సింహా,బుర్ర శివ, పుట్టల కృష్ణ,నల్ల రాజు,చాడా నర్సింహ్మా,బోలుగుల రాజు,చాడా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామంలో తాగునీరు ఎద్దడి లేకుండా నూతన బోర్ ప్రారంభించిన సర్పంచ్ ప్రవీణ్ కుమార్



**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం కుసుమ సముద్రం గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామ సర్పంచ్ ప్రవీణ్ కుమార్ నూతన బోరు మోటార్ను బిగించి నాయకులతో కలిసి మంగళవారం ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామంలోని యాదవ కాలనీ చెంచు కాలనీలో ఎన్నో సంవత్సరాలుగా తాగునీరు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలను గుర్తించి నూతన బోరు వేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడం జరిగిందని ఆయన తెలిపారు. నూతన బోర్ వేసి మోటర్ బిగించి తాగునీటి సౌకర్యం కల్పించిన సర్పంచ్ ప్రవీణ్ కుమార్ కు కాలనీవాసులు ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డ్యాగ కేశవులు, వాడు సభ్యులు దొంగల గంగపూరి, గ్రామ పెద్దలు దొంగల బాలయ్య, తిరుపతయ్య యువకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు శాస్త్రీయ పద్ధతులను పాటించి ఆర్థికంగా ఎదగాలి

### యూరియా వినియోగం సాగు ఖర్చులు తగ్గించాలి

### డాక్టర్ స్వర్ణలత దేవి డిసిసి ఉపాధ్యక్షులు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోపాల్ నాయక్



**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల;** రైతులు పంట సాగును శాస్త్రీయ పద్ధతులను పాటించి సూర్య వినియోగాన్ని పూర్తిగా తగ్గించి పంట సాగు ఖర్చులను కూడా తగ్గించి ఆర్థికంగా ఎదగాలి డాక్టర్ స్వర్ణలత డిసిసి ఉపాధ్యక్షులు బొలుసని భీంరెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్ రైతులకు సూచించారు, వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని బండవెల్లికచర్ల గ్రామంలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ పరిశోధన వారిచే మండల వ్యవసాయ అధికారి వీరస్వామి ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో రైతులకు పంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వరి పరిశోధన కేంద్రం రాజేంద్రనగర్ శాస్త్రవేత్త డాక్టర్ స్వర్ణలత మాట్లాడుతు రైతులు అధికంగా యూరియా వాడకాన్ని తగ్గించాలన్నారు. యూరియా అధికంగా వినియోగం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతిని దీర్ఘకాలిక ఉత్పాదకత తగ్గుతుందని తెలిపారు. యూరియా వినియోగం తగ్గడం ద్వారా సాగు ఖర్చులు కూడా తగ్గుతాయని వివరించారు. అలాగే రైతులు రసాయన వినియోగాన్ని తగ్గించే ప్రకృతిని కాపాడాలని అధిక రసాయనాలు వాడడం వల్ల పర్యావరణం నేలతల్లి ఆరోగ్యం దెబ్బతింటుందని ఆమె తెలిపారు. పురుగుమందుల ప్రభావం వల్ల రైతులకు మేలు చేసే వానపాములు మిత్ర పురుగులు కూడా నశిస్తాయని అన్నారు. ప్రస్తుతం మార్కెట్లో గిరాకీ ఉన్న వరి రకాలు సాగు చేసి అధిక ఆదాయాన్ని పొందాలని రైతులకు సూచించారు. పంటలను కాపాడటానికి వేప నూనె స్ప్రే దశపర్ని కషాయం, అగ్నాస్త్రం, బ్రహ్మాస్త్రం వంటి సహజ పద్ధతులను వినియోగించి రసాయన రైత పంటలను పండించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్ అనూష, మండల వ్యవసాయ అధికారి వీరస్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆత్మ కమిటీ మెంబర్ గోపాల్ నాయక్, మండల అభివృద్ధి అధికారి రామకృష్ణ నాయక్, బండవెల్లికి చెర్ల సర్పంచ్ శ్రీనయ్య, పాంబండి ఆలయ కమిటీ చైర్మన్ మైపాల్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి బాబు పంచాయతీ సెక్రెటరీ జహంగీర్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఉద్యమాల నిర్మాణమే సుందరయ్య కు నివాళి





**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో :** ప్రజాఉద్యమాలను నిర్వహించి పార్టీ శ్రేణులు ప్రజల సమస్య ల పరిష్కారం కృషి చేయడమే పుచ్చలపల్లి సుందరయ్య కు నివాళి అని సిపిఐ (ఎం)ఖమ్మం డివిజన్ కార్యదర్శి రాష్ట్ర కమిటీ సభ్యులు వై .విక్రం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీనివాస రావుపేర్కొన్నారు. దక్షిణ భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చల పల్లి సుందరయ్య వర్ధంతి సభ పార్టీ త్రీ టౌన్ కమిటీ ఆద్వర్యంలో త్రీ టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళ వారం స్థానిక ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాలులో జరిగింది. ఈ సభకు వారు అతిథులు గా హాజరై మాట్లాడుతూ ప్రజాప్రతినిదిగా ఎన్నికైన తరువాత ఆస్తులను కూడబెట్టే సమాజంలో ఎంపీ గా ఎం ఎల్ ఏ గా పనిచేసినా తన ఆస్తుల ను పేద ప్రజలకు పంచిన వ్యక్తి సుందరయ్య అని కొనియాడారు ఆయన నుంచి పోరాటాలే కాకుండా చైతన్యం కూడా నేర్చుకోవాలి అని అన్నారు. సుందరయ్య స్పూర్తి తో కేంద్ర రాష్ట్ర ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపు నిచ్చారు. కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ తో పాటు నిత్యావసరాలు పెంచి సామాన్య ప్రజల పై భారాలు మోపుతుందని ఆరోపించారు. కష్టాలు లేని సమాజం కోసం బిజెపి పై పోరాడాలని పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగాలను ప్రవేట్ పరం చేస్తూ వాటిని బడా పెట్టుబడి దారులకు దేశాన్ని దోచి పెడుతుందని ఆరోపించారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కొత్త పెన్షన్లు ఇవ్వకుండా ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తుందని మండిపడ్డారు పుచ్చలపల్లి సుందరయ్య జీవితాంతం ప్రజల శ్రేయస్సు కోసం ప్రజల జీవితాల బాగు కోసం కృషి చేశారని ఆయన కొనియాడారు. సుందరయ్య భూస్వామ్య కుటుంబంలో జీవించినప్పటికీ ఆ వ్యవస్థ లక్షణాలన్నింటినీ వదులుకొని సామాన్య మానవునిగా ప్రజల కోసం జీవితాంతం జీవించారని తెలిపారు. ఆడంబరాలకు దూరంగా ఆదర్శాలకు దగ్గరగా తాను నమ్మిన కమ్యూనిస్టు ఆశయం కోసం ఎన్ని కష్టాలు నష్టాలు వచ్చినా వాటని సమర్థవంతంగా ఎదుర్కొంటూ మహోన్నత ప్రజా నేతగా ఎదిగారని అన్నారు. విలువలతో కూడిన రాజకీయాలను చేయడంలో విప్లవ నైతికతను రోజువారి జీవితంలో ఆచరించడంలో ఆయనకు ఆయనే సాటి అని తెలిపారు. సుందరయ్య సంఘసంస్కర్తగా తన జీవితాన్ని ప్రారంభించి మహోన్నత సామాజిక విప్లవకారణంగా మారారని కొనియాడారు. కష్టాలు కన్నీళ్లు లేని ఒక సామాజిక వ్యవస్థ ఉందని అది సోషలిజం అని ఆయన బలంగా నమ్మారని తెలిపారు. సోషలిస్టు వ్యవస్థను భారతదేశంలో నిర్మించడానికి ఉన్న అవకాశాలను భౌతిక పరిస్థితులను సుందరయ్య అంచనా వేసి సరియైన కమ్యూనిస్టు పార్టీ సిపిఐ(యం)ను నిర్మించడంలో ఆయన కృషి ఎనలేనిదని తెలిపారు. సుందరయ్య ప్రదర్శించిన విప్లవ నైతికతను ఆదర్శాలను పునికి పుచ్చుకొని ఆయన అందించిన కర్తవ్యాలను బాధ్యతగా ఎంచుకొని సామాజిక మార్పు కోసం అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదే సుందరయ్యకి మనం ఇచ్చే ఘనమైన నివాళి అని తెలిపారు.తొలుత పార్టీ పతాకాన్ని మాజీ కార్పొరేటర్ యల్లం పల్లి వెంకట్రావు ఎగురవేయగా సుందరయ్య చిత్రప టానికినికి విక్రం యర్రా శ్రీనివాసరావు లు పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం ఇటీవల పదవీ కాలం ముగిసిన మాజీ కార్పొరేటర్లు యర్రా గోపి ఎల్లంపల్లి వెంకట్రావు లను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఎం జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్,పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు వజినేపల్లి శ్రీనివాస రావు పత్తి పాక నాగ సులోచన త్రీ టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్. కె సైదులు యర్రా మల్లిఖార్జున్ ఎస్. కె.ఇమామ్ యర్రా రంజిత్ పోతురాజు జార్జి పార్టీ సీనియర్ నాయకులు బండారు యాకయ్యా డివిజన్ కమిటీ సభ్యులు బజ్జురి రమణా రెడ్డి ఎస్. కె హామీనా బండారు సునీత తదితరులు పాల్గొన్నారు

# మంజూరైన ఇందిరమ్మ ఇల్లు తొందరగా పూర్తి చేయాలి

### ఎంపీడీవో రామకృష్ణ నాయక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోపాల్ నాయక్



**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలైన చెంచు కుటుంబాలకు ఇందిరమ్మ లను మంజూరు చేయడం జరిగిందని వాటిని తొందరగా పూర్తి చేయాలని కుల్కచర్ల మండల అభివృద్ధి అధికారి రామకృష్ణ నాయక్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్ సూచించారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని సాల్విడ్ గ్రామంలో మంగళవారం ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులందరూ తొందరగా పూర్తి చేసుకోవాలని రెండో విడతల కూడా ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాని వారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరి ఇస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంజిలమ్మ, పంచాయతీ కార్యదర్శి ఎండి హర్షద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శం

**నూతనకల్ (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి, చిల్పకుంట్ల సర్పంచ్ అంజపల్లి నర్సమ్మ లక్ష్మయ్య అన్నారు. మంగళవారం నూతనకల్ మండలం చిల్పకుంట్లలో సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీతి నిజాయితీ ఆదర్శ విలువలకు సుందరయ్య నిలువెత్తురూపమని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బొజ్జ శ్రీనివాస్ బత్తుల తిరుమలేష్ శ్రీనివాస రెడ్డి కూసు సైదులు వెంకటముత్యం పోలేపక శ్రీను జనార్దన్ శ్రీరాములు మధు రవి జగతయ్య కూసు వెంకన్న మున్నా నాగమల్లు విజయ నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు





**అక్రమ రవాణా పై పటిష్ట నిఘా.**

**ప్రజల వద్దకే పోలీసులు వెళ్లి సేవలు అందిస్తున్నారు.**

**జిల్లా ఎస్పీ నరసింహా**

**నూతనకల్ (క్రైమ్ మిర్రర్):** పోలీస్ స్టేషన్ల వార్షిక తనిఖీలలో భాగంగా మంగళవారం జిల్లా ఎస్పీ నరసింహ నూతనకల్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు. ముందుగా పోలీసు పోలీస్ స్టేషన్ ప్రాంగణం, పరిసరాలు పరిశీలించి. సిబ్బంది యూనిఫామ్, క్రమశిక్షణ, పోలీస్ పరికరాలను పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు, ఎలాంటి సమస్య ఉన్న అధికారుల ద్వారా పరిష్కరించుకావాలని సూచించారు. సిబ్బంది సంక్షేమానికి ఎల్లప్పుడు కృషి చేస్తామని తెలిపారు. స్టేషన్ అవరణంలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు.పోలీస్ స్టేషన్ రిసెప్షన్ సెంటర్ నందు రికార్డుల నిర్వహణ ఆన్లైన్ ఫిర్యాదుల నిర్వహణను పరిశీలించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తిస్తూ వారి సమస్యలు విని వారికి భరోసా కల్పించాలని ధైర్యం కల్పించాలని సూచించారు. ప్రాథమిక విచారణ త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు, ఫిర్యాదులపై వెంటనే కేసులు నమోదు చేసి ప్రజలకు నమ్మకం కలిగించాలని తెలిపారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల వద్దకే వెళ్లి పోలీస్ సేవలను అందించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ నందు నిర్వహిస్తున్న రికార్డ్స్ ను తనిఖీ చేసినారు. కేసులు పెండింగ్ ఉండకుండా ఎప్పటికప్పుడు దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించారు. మండల పరిధిలో తరచుగా నేరాలకు పాల్పడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పటిష్టంగా ఉంచి బైండోవర్ చేయడం షీట్స్ నమోదు చేయడం లాంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. సీసీటీవీ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ను పరిశీలించి మండల పరిధిలో ఎక్కువ సీసీ కెమెరాలు పెట్టడానికి గ్రామస్తులను చైతన్య పరచాలని తెలిపారు. సమస్యలపై ఫిర్యాదులు అందుకున్న వెంటనే బాధితుల ఇంటికి వెళ్లి అక్కడినుండే కేసులు నమోదు చేయాలని తెలిపారు.

**పాత నేరస్తులకు రౌడీషీటర్స్ కు కౌన్సిలింగ్..**

మండల పరిధిలో నమోదైన రౌడీషీట్స్ పాత నేరస్తులకు పోలీస్ స్టేషన్ నందు కౌన్సిలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో మెలగకపోతే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని పిడి యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపటం బైండోవర్ చేస్తామని హెచ్చరించారు. పాత నేరస్తులపై రౌడీ షీట్స్ సస్పెక్ట్ షీట్స్ పై ప్రత్యేకంగా ఉంచామని ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన భౌతిక దాడులకు పాల్పడిన అలాంటి వారిని ఉపేక్షించమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డివిజన్ డిఎస్పి ప్రసన్నకుమార్ నాగారం సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ మగ్దుం అలీ, స్థానిక ఎస్సై నాగరాజు, స్టోర్ ఆర్ఎస్ఐ అశోక్, డిసిఆర్బి సిబ్బంది అంజన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, ఐటి కోర్ కానిస్టేబుల్ సుమన్, పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.



## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**నూతనకల్ ( క్రైమ్ మిర్రర్):** మండల పరిధిలోని ఎర్రపహాడ్ ఐకేపీ ధాన్యపు కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మంగళవారం ఆకస్మికంగా పరిశీలించినారు. కేంద్రం నుండి ఇప్పటివరకు ఎగుమతి చేసిన ధాన్యం వివరాలు, రికార్డులను పరిశీలించి రైతులతో మాట్లాడినారు. ఎగుమతి చేసిన ధాన్యం మిల్లు యజమానులతో మాట్లాడి లారీలను తొందరగా దింపేటట్లుగా తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేసినారు.వర్షాభావ పరిస్థితులు ఉన్నందున రైతు సోదరులందరూ తమ దాన్యమును కొనుగోలు అయ్యేంతవరకు తగు జాగ్రత్తలు తీసుకొని తార్పాలిన్ ను తప్పనిసరిగా కప్పి ఉంచేటట్లుగా కేంద్ర నిర్వాహకులు చూసుకోవాలని ఆదేశించినారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీత కొనుగోలు కేంద్ర నిర్వాహకులు లింగాల సత్తయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.

## "నాలుగు సార్లు గెలిచి శంషాబాద్‌కు చేసింది ఏంటి?"

### ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌పై జీవీపీ సాగర్ ఘాటు విమర్శలు




**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి శంషాబాద్‌కు చేసింది ఏమీ లేదు" అంటూ బిఆర్ఎస్ నాయకుడు జీవీపీ సాగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. శంషాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాళ్లగూడా రోడ్డు సమస్యపై మాజీ హోంమంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఫోన్ చేసి పనులు త్వరగా ప్రారంభించాలని ఒత్తిడి తీసుకొచ్చారని, బిఆర్ఎస్ పార్టీ క్రెడిట్ తీసుకుంటుందనే భయంతో ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు హడావుడి చేస్తున్నారని మండిపడ్డారు."సబితా ఇంద్రారెడ్డిని విమర్శించే అర్హత కొందరికి లేదు. శంషాబాద్ లోని , ఫిరంగి కాల్వ సమస్యలపై ఇంతవరకు ఎవరూ స్పందించలేదు. వాటిపై కూడా చర్చించాలి" అని డిమాండ్ చేశారు."ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన అధికార పార్టీ నేతలు రాజకీయ విమర్శలకే పరిమితమవుతున్నారు. శంషాబాద్ అభివృద్ధిపై చర్చిద్దాం.. ప్రజల కోసం ఎవరు ఏం చేశారో లైవ్ డిబేట్‌కు రావాలి" అంటూ సవాల్ విసిరారు.శంషాబాద్-షాబాద్ రోడ్డు నిర్మాణ పనులు కూడా వెంటనే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

**గండిపేట(క్రైం మిర్రర్):** దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం జల్‌పల్లి ప్రాంతానికి చెందిన గడిపెల్లి నరేష్(22) క్యాటరింగ్ పనులు చేస్తుంటాడు. మంగళవారం మైలార్‌దేవ్‌పల్లి ఏరియాలో జువెలరీ షాపుల దగ్గర అనుమానస్పందంగా తిరుగుతున్నాడని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ చేపట్టగా సుమారు 12 రోజుల క్రితం కాటేదాన్‌లోని టీఎన్‌జీవోస్ కాలనీలో జరిగిన దొంగతనం, అదే విధంగా పహాడీ షరీఫ్ పీఎస్‌కు సంబంధించిన మరోక దొంగతనం కేసును ఒప్పుకోవడం జరిగిందన్నారు. నిందితుడి వద్ద నుంచి వెండి కాలి గొలుసులు మూడు జతలు(సుమారు 200 గ్రాముల బరువు), వెండి బిస్కెట్(సుమారు 250 గ్రాముల బరువు), బంగారు పుస్తెలు రెండు(సుమారు 3.012 గ్రాములు), బొట్టు బంగారు పుస్తెలు--2 సుమారు(1.732 గ్రాముల బరువు)ను స్వాధీనం చేసుకోని నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి జీవిత ఖైదు



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** ప్రేమ పేరుతో మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిపై దర్యాప్తు అధికారులు సమర్పించిన ఆధారాలు, సాక్ష్యాలను పరిశీలించిన అనంతరం నేరం రుజువుకావడంతో నిందితుడు మహమ్మద్ ఖాజా మొయినుద్దీన్ అలియాస్ ఖాజా కు ఎల్బీనగర్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎం.కే. పద్మావతి నిందితుడికి జీవిత ఖైదు శిక్షతో పాటు 13,000 జరిమానా విధించారు. అదే విధంగా బాధిత బాలికకు 1లక్ష విక్టిమ్ కాంపెన్సేషన్ మంజూరు చేస్తూ తీర్పు వెలువరించారు. మైనర్ బాలికలపై జరిగే లైంగిక నేరాలపై కఠిన చర్యలు తప్పవని ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసినట్లైంది.

# ఇందిరా కాంతిలో పనిచేస్తున్న విబికేలా సమస్యలు పరిష్కరించాలి



క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: తెలంగాణ రాష్ట్రంలో ఇందిరా కాంతి పథకంలో పనిచేస్తున్న విబికేల గ్రామ సంఘం సహాయకుల సమస్యలను తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం పరిష్కరించాలని మంగళవారం కుల్కచర్ల మండల మహిళా సమాఖ్య ముందు నిరసన చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర ఇందిరా కాంతి పథకం విబికేలా జేఏసీ పిలుపుమేరకు నిరసన కార్యక్రమం చేపట్టామని విబికేలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలతో గ్రామాలలో ఉన్న మహిళా సంఘాల మహిళలకు సేవ చేస్తున్నామని, పని భారాన్ని గుర్తించి వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటిన వేళలో మాకు గౌరవితనంగా 5000 రూపాయలకు పనిచేస్తున్నామని, రాత్రి పగలు అనకుండా ఉద్యోగం చేస్తున్నాము. ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు చేసిన గ్రామ సంఘం సహాయకులతో పనిచేపిస్తుందని,మాకు ప్రభుత్వం నుండి క్యాబ్ సౌకర్యం లేదు అయినా మా సొంత మొబైల్ ఫోన్లో యాప్లు వేసి పనిచేస్తున్నామని వారు సూచించారు. ప్రభుత్వానికి మా యొక్క ప్రధాన డిమాండ్లు విబికే లకు నెలకు కనీసం వేతనం 20000 ఇవ్వాలని,సేర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ వర్తింపచేయాలని, అర్హులైన విబికేలను సీసీలుగా పదోన్నతి కల్పించాలని, వివో ఏలకు సాధారణ ఆరోగ్య భీమా 20 లక్షల వరకు ఇవ్వాలని,ట్యాబ్ నెట్ సౌకర్యం కల్పించాలని,58 జీవోను సవరించి మాకు న్యాయం చేయాలని వారు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివోఏ లు చంద్రయ్య ఘనపూర్, గుండుమల నర్సింలు తిరుమాలపూర్, గోపాల్ రెడ్డి పుట్టపాడు, శివానంద్ అంతారం, వి సునీత ఇప్పాయిపల్లి, రాంపూర్ కుస్మసముద్రం అంతారం కుల్కచర్ల తదితర గ్రామాల వివోఏలు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## అపస్మారక స్థితిలో పడి ఉన్న గుర్తుతెలియని యువకుడు

### ఆనవాళ్లు తెలిసినవారు కూకట్ పల్లి పోలీసులను సంప్రదించాలి



**కూకట్ పల్లి, మే19 (క్రైమ్ మిర్రర్) :** భాగ్యనగర్ కాలనీ ఉషా ముల్లపూడి రోడ్ లో మంగళవారం ఓ గుర్తు తెలియని యువకుడు అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని రోడ్డుపై ఓ యువకుడు స్పృహ లేకుండా పడి ఉన్నట్లు గుర్తించారు. స్పృహలో లేని యువకుడిని అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. యువకుడు స్పృహలో లేకపోవడంతో అతనికి సంబంధించిన పూర్తి వివరాలు లభించలేదు, ఆ యువకుడి 32 నుండి 36 సంవత్సరాల మధ్యలో ఉన్నట్లు గురించి ఎవరికైనా వివరాలు తెలిసిన యెడల కూకట్ పల్లి పోలీసులకు సమాచారం అందించాలని పోలీస్ లు కోరారు.

## మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు

### మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి

కామారెడ్డి: కామారెడ్డి పట్టణంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాల క్రితం కామారెడ్డి నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా, వర్షాకాలం మినహా మిగిలిన అన్ని కాలనీల్లోనూ నీటి ఎద్దడి ఏర్పడేదని అన్నారు. ఆ రోజుల్లో ప్రజలు ఖాళీ బిందెలతో రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపే వారని చెప్పారు.ఈ నీటి సమస్యను శాశ్వతంగా తీర్చడమే తమ ధ్యేయంగా ముందుకెళ్తున్నట్లు చెప్పారు. కామారెడ్డి పట్టణానికి 10 వాటర్ ట్యాంకులు ఉన్నాయని, అమృత్ 2.0 పథకంలో భాగంగా 9 వాటర్ ట్యాంకులు పూర్తయ్యాయని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, డీఈ హనుమంతరావు, ఏఈ వినోద్, కౌన్సిలర్లు వాజిద్, జావేద్, అంజద్, బబ్లు, నాయకులు, కాళ్ల గణెలిష్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి కోసం మహిళకు వేధింపులు

### కాంగ్రెస్ నేతపై పోలీసుల కేసు నమోదు

కామారెడ్డి:ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తానని నమ్మబలికి, దానికి ప్రతిఫలంగా తన కోరిక తీర్చాలంటూ ఓ మహిళను వేధించిన ఘటన కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితురాలు ఫిర్యాదు మేరకు రాజంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం రాజంపేట మండల కేంద్రం చెందిన ఒక మహిళకు ఇందిరమ్మ ఇండ్లు కావాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన సదరు నాయకుడిని సంప్రదించింది. అయితే ఇల్లు మంజూరు చేయాలంటే తన కోరిక తీర్చాలని, తనకు లొంగిపోవాలని అతడు ఆమెను తీవ్రంగా వేధించడం ప్రారంభించాడు. ఈ వేధింపులు తట్టుకోలేక బాధితురాలు చివరికి రాజంపేట పోలీస్టేషన్లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి రాతపూర్వక ఫిర్యాదు మేరకు సదరు కాంగ్రెస్ నాయకుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.ఇందిరమ్మ ఇండ్ల విషయంలో మహిళపై అసభ్యంగా ప్రవర్తించినందుకు, పలువురిని డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపణ రావడంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన బెస్ట్ చంద్రంను పార్టీ అధిష్టానం మేరకు వాటి నుండి సస్పెండ్ చేశామని రాజంపేట మండల అధ్యక్షుడు కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

## జొన్నల కొనుగోలు కోసం ఆందోళన

### జాతీయ రహదారిపై రైతుల ధర్నా



నిర్మల్,మే: జొన్నలు కొనుగోలు చేయాలని డిమాడ్ చేస్తూ నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని మార్కెట్ యార్డు వద్ద స్వర్ణ-నిర్మల్ రహదారిపై మంగళవారం రైతులు ధర్నా నిర్వహించారు. దీంతో రోడ్డుకు ఇరువైపుల గంటపాటు వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ధర్నా విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. తహసీల్దార్ విజయ్‌కాంత్‌రావుకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. తహసీల్దార్ కలెక్టర్ భవేశ్‌మిశ్ర దృష్టికి తీసుకువెళ్లి రెండు రోజుల్లో జొన్నలు కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. సారంగాపూర్ మార్కెట్ యార్డులో జొన్నలు పోసి నెల రోజులు గడుస్తున్న ఎవరు పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి 20 రోజుల క్రితం ప్రారంభించారని, అప్పటి ఇప్పటివరకు గన్నీ బ్యాగులు లేక ఒక గింజా కూడా కొనుగోలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాతావరణంలో మార్పుల వల్ల ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుండడంతో జొన్నలు తడసి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు.

